
94406 62699 www.rajadhanivartalu.com rajadhanivartalu rajadhaniv RNI No. APTEL 2015/ 66622 స్థాపితం : 2015 Postal Regd No: GTR/84/2019-21




# రాజధాని వార్తలు

RAJADHANI VARTALU




అమరావతి సంపుటి : 4 సంచిక : 43, పేజీలు 4, వెల: రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు వార పత్రిక జూలై సోమవారం 29 - ఆదివారం 4 ఆగస్టు, 2019

Amaravati Volume : 4 Issue : 43, Pages 4, Rate : 2.00 ANDHRA PRADESH CAPITAL'S FIRST TELUGU WEEKLY July Monday 29 - Sunday 4 August, 2019

## విజయవాడ, తిరుపతి విమానాశ్రయాల ప్రైవేటీకరణ!

### ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా చైర్మన్ గురుప్రసాద్ మహాపాత్ర వెల్లడి



**సంవత్సరానికి 15 లక్షల ప్రయాణికుల రాకపోకలు సాగించే ఎయిర్‌పోర్టులన్నింటినీ ప్రైవేటీకరించాలని ప్రభుత్వం భావిస్తోంది. మలిదశలో 25 ఎయిర్ పోర్టులను ప్రైవేటీకరించాలని యోచిస్తున్నాం. అందులో విజయవాడ, తిరుపతి ఉండొచ్చు.**

**రాజధాని వార్తలు, విజయవాడ :** భవిష్యత్తులో విజయవాడ, తిరుపతి విమానాశ్రయాలను ప్రైవేటీకరించే అవకాశం ఉందని ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా చైర్మన్ గురుప్రసాద్ మహాపాత్ర తెలిపారు. ఆయన శుక్రవారం తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ప్రస్తుతం ఆరు విమానాశ్రయాల ప్రైవేటీకరణ ప్రక్రియ విజయవంతంగా పూర్తయిందని చెప్పారు. గతంలో ఢిల్లీ, ముంబయి ఎయిర్‌పోర్టుల్లో పెట్టుబడుల ఉపసంహరణ ప్రక్రియకు చాలా సమయం పట్టిందని, కానీ ప్రస్తుత ప్రభుత్వంలో ఆరు ఎయిర్‌పోర్టుల ప్రైవేటీకరణపై గత డిసెంబర్‌లో నిర్ణయం తీసుకోగా ఏప్రిల్‌కల్లా కేబినెట్ నోట్ సిద్ధమైందని పేర్కొన్నారు. ఇప్పటికే అహ్మదాబాద్, లఖ్‌నవూ, మంగళూరు ఎయిర్‌పోర్టులను బిడ్డర్లకు అప్పగించే ప్రక్రియ మొదలైనట్లు చెప్పారు. మిగతా మూడు ఎయిర్‌పోర్టుల అప్పగింత సాధ్యమైనంత త్వరలో పూర్తవుతుందన్నారు. ప్రభుత్వ 100 రోజుల ఎజెండాలో మరిన్ని ఎయిర్‌పోర్టులను ప్రైవేటీకరించాలనే అంశం ఉన్నట్లు చెప్పారు. ప్రైవేటు పెట్టుబడులను ఆకర్షించేందుకు వీలుగా ఇందుకోసం కన్సల్టెంట్ల నియామకం కూడా జరిగినట్లు చెప్పారు.

**బెంగళూరు, హైదరాబాద్‌ల్లో రెండో రన్‌వేలు**

ఎయిర్‌పోర్టుల ప్రైవేటీకరణ జరిగినప్పుడు అంతకు ముందున్న ఉద్యోగుల్లో కొంతమందిని కొత్త యాజమాన్యం తీసుకొనేలా ఒప్పందంలో షరతులు ఉంటాయని మహాపాత్ర తెలిపారు. ఢిల్లీ, ముంబయి, కోల్‌కతా, చెన్నై, హైదరాబాద్, బెంగళూరుల్లో రెండో విమానాశ్రయం రావాల్సిన అవసరం ఉందని, అయితే అదృష్టవశాత్తు బెంగళూరు, హైదరాబాద్‌లో విమానాశ్రయాల్లో కావాల్సినంత భూమి అందుబాటులో ఉన్నందున అక్కడ రెండో రన్‌వేలు నిర్మించుకోవచ్చని చెప్పారు. బెంగళూరులో ప్రస్తుతం రెండో రన్‌వే నిర్మాణానికి ప్రణాళిక రూపొందిస్తున్నారని పేర్కొన్నారు. ఢిల్లీ, హైదరాబాద్, బెంగళూరు ఎయిర్‌పోర్టులు మినహా మిగతా ఏ ఎయిర్‌పోర్టుకూ చాలినంత భూమి లేదని తెలిపారు. విమానాశ్రయాల విస్తరణకు ఆ చుట్టుపక్కలున్న భూములను గుర్తించి అక్కడ ఎత్తయిన భవనాల నిర్మాణానికి అనుమతి ఇవ్వకపోతే చాలని చెప్పారు. ఎయిర్‌పోర్టులను ధనవంతుల కేంద్రంగా చూశారని, ఇప్పటికైనా వీటిని అందరికీ ఉపయోగపడే రవాణా కేంద్రాలుగా గుర్తించి నగరానికి 60-70 కి.మీ దూరంలోనైనా సరే తగినంత భూమి సేకరించి పెట్టాలని సూచించారు.

## 1,26,728 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు



- మరో 9,359 లైన్‌మెన్ పోస్టులకు వేరుగా నోటిఫికేషన్ ఇవ్వనున్న విద్యుత్ డిస్కమ్‌లు
- నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ
- వేర్వేరుగా నోటిఫికేషన్లు జారీచేసిన పంచాయతీరాజ్, పట్టణాభివృద్ధి శాఖలు
- 22 రకాల పోస్టులను భర్తీ చేయనున్న సర్కారు
- మొత్తం 1,36,087 ప్రభుత్వోద్యోగాల భర్తీ
- ఆన్‌లైన్ ద్వారానే దరఖాస్తుల స్వీకరణ
- మూడు ప్రత్యేక వెబ్‌సైట్ల ఏర్పాటు
- విద్యార్హత, వయో పరిమితి,ఎంపిక విధానం వంటి వివరాలన్నీ వెబ్‌సైట్‌లో
- ఆగస్టు 10 అర్ధరాత్రి వరకు దరఖాస్తుల స్వీకరణ
- సెప్టెంబరు 1న రాత పరీక్ష.. 150 మార్కులు,150 ప్రశ్నలు.. నెగిటివ్ మార్కులు కూడా
- ఇప్పటికే కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్‌లో పనిచేసే వారికి వెయిటేజీ

**రాజధాని వార్తలు, అమరావతి :** రాష్ట్ర చరిత్రలోనే ఎన్నడూ కనివినీ ఎరుగని రీతిలో ఒకే విడతలో 1,26,728 ప్రభుత్వోద్యోగ నియామకాలకు సంబంధించిన రెండు నోటిఫికేషన్లు శుక్రవారం రాత్రి విడుదలయ్యాయి. గ్రామ సచివాలయాల్లో 95,088 ఉద్యోగాలకు పంచాయతీరాజ్ శాఖ.. పట్టణ వార్డు సచివాలయాల్లో 31,640 ఉద్యోగాలకు పట్టణాభివృద్ధి శాఖ నోటిఫికేషన్లను వేర్వేరుగా జారీచేశాయి. శనివారం ఉ.11 గంటల నుంచి ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమవుతుంది. ఆగస్టు 10వ తేదీ అర్ధరాత్రి వరకు దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతుంది. సెప్టెంబరు ఒకటవ తేదీన రాత పరీక్ష నిర్వహిస్తారు. సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేసిన రోజునే గ్రామ, వార్డు స్థాయిలో సచివాలయాల వ్యవస్థను కొత్తగా ఏర్పాటుచేసి, ప్రతి సచివాలయంలో పనిచేసేందుకు 10 నుంచి 12 మంది చొప్పున నియమించేందుకు నిర్ణయించిన విషయం తెలిసిందే. గ్రామీణ ప్రాంతాల్లో 11,158 గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేస్తుండగా.. పట్టణ ప్రాంతాల్లో 3,786 వార్డు సచివాలయాలను ఏర్పాటుచేస్తున్నారు. వైద్య ఆరోగ్య, రెవెన్యూ, పోలీస్ తదితర 11 ప్రభుత్వ శాఖలను సమన్వయం

- మిగతా 2 లో

# అవినీతికి అడ్డుకట్ట

- ప్రజాధనం ఆదా, అందరికీ సమాన అవకాశాలే లక్ష్యం
- రూ.100 కోట్లు దాటిన ప్రాజెక్టులన్నీ హైకోర్టు జడ్జి లేదా రిటైర్డ్ జడ్జి పరిశీలనకు
- న్యాయ 'పరీక్ష'కు ఆమోదం



**రాజధాని వార్తలు, అమరావతి :** దేశ చరిత్రలో తొలిసారిగా టెండర్ల ప్రక్రియలో అత్యుత్తమ విధానానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అవినీతి, అక్రమాలకు ఏమాత్రం తావులేకుండా ముందుగా న్యాయపరమైన పరిశీలన తరువాతే పారదర్శకంగా టెండర్లను ఆహ్వానించే చరిత్రాత్మక ఘట్టం శుక్రవారం ఆవిష్కృతమైంది. ఇందుకు సంబంధించిన బిల్లును కూలంకషంగా చర్చించిన అనంతరం శాసనసభ ఆమోదించింది. ప్రతిష్టాత్మకమైన ఈ బిల్లును ఆమోదిస్తున్నట్లు సభ్యుల హర్షధ్వానాల మధ్య స్పీకర్ తమ్మినేని సీతారాం ప్రకటించారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే టెండర్లను పారదర్శకంగా ఖరారు చేసేందుకు న్యాయ పరిశీలనను ఏర్పాటు చేస్తామని అదే వేదిక నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. అందుకు అనుగుణంగా టెండర్ల విధానాన్ని సమూలంగా ప్రక్షాళన చేసి పారదర్శకత, ప్రజాధనం ఆదాకు పెద్దపీట వేస్తూ అక్రమాలు, పక్షపాతం, అవినీతి నిర్మూలనే లక్ష్యంగా కొత్తగా ఆంధ్రప్రదేశ్ మౌలిక సదుపాయాల (న్యాయపరమైన ముందస్తు సమీక్ష ద్వారా పారదర్శకత) చట్టం-2019 బిల్లు రూపుదిద్దుకుంది. ఈ బిల్లు అసెంబ్లీ ఆమోదం పొందడంతో త్వరలోనే చట్ట రూపం దాల్చనుంది.

**పారదర్శకతకు పెట్టపీట**

ఈ బిల్లు ద్వారా మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ టెండర్ల ప్రక్రియలో పారదర్శకతకు ప్రభుత్వం పెద్దపీట వేసింది. హైకోర్టు జడ్జి లేదా రిటైర్డ్ జడ్జి నేతృత్వంలో టెండర్ల డాక్యుమెంట్ ముందస్తు పరిశీలన జరుగుతుంది. ప్రజల నుంచి అందిన సూచనల మేరకు, న్యాయమూర్తి పరిశీలన అనంతరం మార్పులు, చేర్పులతో టెండర్ల ప్రతిపాదనలను ఖరారు చేస్తూ బిడ్డింగ్‌కు వీలుగా బిల్లులో ప్రొవిజన్స్ ప్రతిపాదించారు. అందరికీ సమాన అవకాశాలు, నాణ్యతా ప్రమాణాలు, ఖర్చు విషయంలో జాగ్రత్త పాటించడమే లక్ష్యంగా బిల్లుకు ప్రభుత్వం రూపకల్పన చేసింది.

**అందరికీ సమాన అవకాశాలు..**

కొత్త విధానంలో ఏదైనా పనిని ప్రతిపాదిస్తున్న ప్రతిశాఖ ఆ పత్రాలను న్యాయమూర్తికి సమర్పించాల్సి ఉంటుంది. టెండర్లను పిలవడానికి ముందుగానే అన్ని పీపీపీ, జాయింట్ వెంచర్లు, స్పెషల్ పర్పస్ వెహికల్స్ సహా ప్రభుత్వం చేపట్టే అన్ని ప్రాజెక్టులపైనా జడ్జి పరిశీలన చేయనున్నారు. పనులను ప్యాకేజీలుగా విభజించినా సరే మొత్తం పని విలువ రూ.100 కోట్లు దాటితే న్యాయపరిశీలన పరిధిలోకి రావాల్సిందేనని బిల్లులో స్పష్టం చేశారు. న్యాయమూర్తికి సూచనలు, సలహాలు అందిస్తున్న వారికి తగిన రక్షణను ప్రభుత్వమే కల్పించనుంది. జడ్జి సిఫార్సులను తప్పనిసరిగా సంబంధిత శాఖలన్నీ పాటించాల్సిందేనని బిల్లులో పేర్కొన్నారు. మొత్తం 15 రోజుల్లో టెండర్ ప్రతిపాదనలను ఖరారు చేయాలని, ఆ తరువాతే బిడ్డింగ్‌కు వెళ్లాలనే నిబంధన బిల్లులో పొందుపరిచారు.

అర్హత ఉన్న కాంట్రాక్టర్లందరికీ సమాన అవకాశాలు కల్పించాలని బిల్లులో స్పష్టం చేశారు. పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, ప్రజాధనం దుర్వినియోగం కాకుండా ఈ విధానం ఉంటుంది. ఎవరైనా ఉద్దేశపూర్వకంగా, పనిగట్టుకుని ఈ ప్రక్రియను అడ్డుకోవడానికి ప్రయత్నిస్తే నిరోధించడానికి తగిన యంత్రాంగాన్ని ఏర్పాటు చేసుకునేలా న్యాయమూర్తికి వెసులుబాటు కల్పించారు. జడ్జి, జడ్జి వద్ద పనిచేస్తున్న సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా భావిస్తారు. ఈ చట్టం ద్వారా తీసుకునే నిర్ణయాలు, ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం లేదా ప్రభుత్వ అధికారులు, సిబ్బంది, ప్రతినిధులపై ఎట్టి దావా క్లెయిమ్ లేదా ఇతర న్యాయ ప్రొసీడింగ్స్ ఏవీ వేయకూడదు. బిల్లులోని ఆర్థిక మెమోరాండంలో నెలవారీ వ్యయం కోసం రూ.3 కోట్లు, ఇతర ఖర్చుల కోసం రూ.ఐదు కోట్లను ప్రాథమికంగా కేటాస్తున్నట్లు పేర్కొన్నారు.

**బిల్లులో కీలక అంశాలు ఇవీ...**

- ఏ టెండరైనా, ఏ పనైనా విలువ రూ.100 కోట్లు దాటితే టెండర్ పత్రాలను న్యాయమూర్తి పరిశీలనకు పంపుతారు.
- తరువాత దాన్ని ప్రజా బాహుళ్యం (ఇంటర్నెట్, వెబ్ సైట్)లో 7 రోజుల పాటు అందరికీ అందుబాటులో ఉంచి ప్రజల నుంచి సలహాలు, సూచనలు స్వీకరిస్తారు.
- న్యాయమూర్తికి సాంకేతిక తోడ్పాటు కోసం టెక్నికల్

- మిగతా 2 లో

**ప్రజాసేవలో ఎన్ఆర్ఐ ఆసుపత్రి**

4లో

**జెరుసలేంకు జగన్... అమెరికాకు చంద్రబాబు**

2లో

**ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి మనదేశాన్ని కాలుష్యం బారి నుండి రక్షించేందుకు ప్రయత్నం చెయ్యాలని రాష్ట్ర గవర్నర్ శ్రీ బిశ్వభూషణ్ హరిచందన్ కోరారు. కార్గిల్ యుద్ధం జరిగి 20 సంవత్సరాలు అయిన సందర్భంగా దేశ ప్రధాని నరేంద్రమోడి యావత్ దేశానికి ఈరోజు మొక్కలు నాటాలని పిలుపు నిచ్చిన నేపథ్యంలో శుక్రవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్, ఆయన సతీమణి సుప్రభ హరిచందన్, గవర్నర్ కార్యదర్శి ఎం.కె.మీనా, జాయింట్ సెక్రటరీ అర్జునరావు, కలెక్టర్ ఏ.యండి.ఇంతియాజ్, మున్సిపల్ కమీషనర్ ప్రసన్న వెంకటేష్ లు పండ్ల మొక్కలు నాటారు.**



**దివంగత మాజీ రాష్ట్రపతి, మిస్సైల్ మ్యాన్ డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నివాళులర్పించారు. భారత శాస్త్రసాంకేతిక రంగాల్లో ఆయన కృషి మరువలేనిదన్నారు. కలాం నడిచిన బాట, ఆయన పద్ధతులు లక్షలాది మందికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. అబ్దుల్ కలాం బోధనలు ఇప్పటికి కూడా ఎంతో మందికి ప్రేరణగా నిలుస్తున్నాయని సీఎం వైఎస్ జగన్ ట్వీట్ చేశారు.**



## కాటన్ బ్యాగ్‌లే బెస్టు : కలెక్టర్

- క్లాత్ బ్యాగ్‌ల తయారీపై స్వయం సంఘాలకు శిక్షణ
- పర్యావరణ పరిరక్షణే ధ్యేయం





**రాజధాని వార్తలు, విజయవాడ :** ఏపీలోని కీలక నగరం విజయవాడలోనూ ప్లాస్టిక్ బ్యాన్‌ను అమలు చేసేందుకు చర్యలు మొదలయ్యాయి. నగరంలో పేరుకుపోతున్న ప్లాస్టిక్ వ్యర్థాల కారణంగా కాలుష్యం పెరిగిపోతుందని భావిస్తున్న అధికారులు... ఈ దిశగా అడుగులు వేసేందుకు సిద్ధమవుతున్నారు. నగరంలో ప్లాస్టిక్ వాడకంపై పూర్తి నిషేధం విధించబోతున్నట్లు కలెక్టర్ ఇంతియాజ్ ప్రకటించారు. ప్లాస్టిక్ నిషేధంపై వచ్చే వారం ప్రకటన విడుదల చేస్తామన్నారు. కళ్యాణ మండపాలు, రెస్టారెంట్స్, హెూటళ్లు, దుకాణాలు వద్ద ప్లాస్టిక్ వాడకం ఎక్కువగా ఉందని ఆయన వెల్లడించారు.

త్వరలోనే దీనిపై ప్రజలతో సమావేశమై ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే దుష్పరిణామాలను వివరిస్తామని అన్నారు. ప్రత్యామ్నాయంగా కాటన్ క్లాత్ బ్యాగ్స్, పేపర్ గ్లాసులు వాడకంలోకి తెస్తామని ఆయన స్పష్టం చేశారు చెప్పారు. కార్పొరేషన్, పోలీస్, కమర్షియల్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్ల సహకారంతో స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తామని వెల్లడించారు. ప్రజల్లో అవగాహన పెంచేందుకు సోషల్ మీడియాలో కూడా ప్రచారం చేస్తామన్నారు. ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే నష్టాలపై పలు రూపాల్లో విద్యార్థులకు పోటీలు, తదితర కార్యక్రమాలు చేపడతామని వివరించారు. రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోషియేషన్స్, వ్యాపార సంస్థలు, సూపర్ మార్కెట్లు, హోటల్స్, షాపింగ్ మాల్స్, బార్ అండ్ రెస్టారెంట్లు, మాంసం దుకాణాలు, ప్లాస్టిక్ బ్యాగ్ డీలర్లు, పంపిణీ దారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో మంగళ, బుధ, శుక్రవారాలలో సమావేశం నిర్వహించి అవగాహన కల్పిస్తామన్నారు. ప్రత్యామ్నాయంలో భాగంగా స్వయం సహాయక సంఘాలకు కాటన్ క్లాత్ బ్యాగ్‌లు, పేపరు కప్పుల తయారీపై శిక్షణ ఇస్తామన్నారు. ప్లాస్టిక్ నిషేధాన్ని పర్యవేక్షించే విధంగా నగరపాలకసంస్థ, కమర్షియల్ టాక్స్, పోలీస్, మొబైల్ పోర్టు సభ్యులతో జాయింట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్‌లను ఏర్పాటుచేసి స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని చెప్పారు. ప్లాస్టిక్‌ను నగరంలోకి రానీయకుండా ప్లాస్టిక్ చెక్ పోస్టులను ఏర్పాటు చేస్తామన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతో ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించవచ్చన్నారు. కృష్ణమ్మ శుద్ధి కార్యక్రమం స్ఫూర్తిగా తీసుకుని ప్లాస్టిక్‌ను వాడం అంటూ ప్రజలతో ప్రతిజ్ఞ చేయిస్తామన్నారు.

## 31 తర్వాత పోలవరం టెండర్లు!

### ఉన్నతస్థాయిలో కసరత్తు



**రాజధాని వార్తలు, అమరావతి :** పోలవరం ప్రాజెక్టు ప్రధాన డ్యాం, విద్యుదుత్పత్తి కేంద్రం, ఎడమ కాలువ పనులకు ప్యాకేజీల వారీగా తక్షణమే టెండర్లు పిలిచేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు ముమ్మరం చేసింది. నిపుణుల కమిటీ ఈ ప్రాజెక్టుపై తమ పరిశీలనతో కూడిన నివేదికను ప్రభుత్వానికి సమర్పించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తదుపరి కార్యాచరణ ఎలా ఉండాలనే విషయంలో శుక్రవారం ఉన్నతస్థాయి చర్చలు జరిగాయి. ఈ విషయంలో ఎలా ముందుకు వెళ్లాలో జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆదిత్యనాథ్ దాస్, సీఎం కార్యాలయ అధికారులు చర్చించారు. కొత్తగా టెండర్లు పిలిచేందుకు అనుమతివ్వాలని కోరుతూ పోలవరం ప్రాజెక్టు అథారిటీకి లేఖ రాయనున్నారు. లేఖలో ఏయే అంశాలు చేర్చాలి? ఇప్పుడు కొత్తగా టెండర్లు పిలవాల్సిన అవసరం ఎందుకు వచ్చింది? రివర్స్ టెండర్ల ద్వారా వ్యయం తగ్గించాలనుకోవడం తదితర అంశాలను లేఖలో వివరించనున్నారు. అదనపు చెల్లింపులు, వివిధ ప్యాకేజీల్లో అక్రమాలు జరిగాయంటూ ఇప్పటికే నిపుణుల కమిటీ నివేదించిన విషయం తెలిసిందే. పోలవరం అథారిటీ లేఖకు

- మిగతా 2 లో

## రాజధాని వార్తలు కలం

# నిరుద్యోగులకు వరం


ప్రతి మనిషి గౌరవంగా బ్రతకాలంటే తినడానికి తిండి, ధరించడానికి బట్టలు, ఉండటానికి ఇల్లు తప్పనిసరి ..అయితే ఇవన్నీ కావాలంటే ఉపాధి..లేదా ఉద్యోగం ఉండటం తప్పనిసరి.. ఉద్యోగాల కోసం రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమలు నెలకొల్పినప్పటికీ అవకాశాలు రాకపోవడం స్థానికులను కలచి వేస్తోంది. ఈ పరిస్థితిని నివారించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పరిశ్రమల ఏర్పాటు, ఉపాధి అంశాల విషయంలో 75శాతం స్థానికులకే కేటాయించాలని సంచలన ప్రకటన చేస్తూ, ఆమేరకు చట్టం కూడా రూపొందించింది. దీంతో రాష్ట్రంలోని నిరుద్యోగుల ఆశలు చిగురిస్తున్నాయి. అంతకు ముందు ప్రభుత్వం ఇంటికో ఉద్యోగం పేరుతో 2014లో అధికారం చేపట్టినప్పటికీ ఒక్క ఉద్యోగ నియామకం కూడా జరిపలేదు. దీంతో ఇప్పటివరకు నిరాశ, నిస్పృహలో ఉన్న నిరుద్యోగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఏపీ అసెంబ్లీ సమావేశాల్లో జూలై 22న ఏపీ ప్రభుత్వం తరుపున కార్మిక, ఉపాధి కల్పనా శాఖా మంత్రి గుమ్మనూరు జయరామ్ పారిశ్రామిక రంగంలో ఉపాధికి సంబంధించిన బిల్లుని అసెంబ్లీ ప్రవేశపెట్టారు. 'ఆంధ్రప్రదేశ్ ఎంప్లాయ్‌మెంట్ ఆఫ్ లోకల్ క్యాండిడేట్స్ ఇన్ ఇండస్ట్రీస్ , ఫ్యాక్టరీస్ యాక్ట్ 2019' పేరుతో రూపొందించిన ఈ బిల్లుకు అసెంబ్లీ ఆమోదం తెలపడంతో గవర్నర్ ఆమోదం తర్వాత చట్టంగా అమలులోకి రాబోతోంది.ఈ బిల్లు ప్రకారం రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వం, ప్రైవేటు, ఉమ్మడి సంస్థలలో 75 శాతం ఉద్యోగాలు స్థానికులకే ఇవ్వాలి. ఇప్పటికే ఉన్న పరిశ్రమల్లో రాబోయే మూడేళ్ల కాలంలో స్థానికుల ఉద్యోగాలు 75శాతానికి పెంచాలి. స్థానికంగా తగిన అర్హత లేని ఉన్న వారు అందుబాటులో లేకపోతే ప్రభుత్వంతో సమన్వయం చేసుకుని, వారికి శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించాల్సి ఉంటుంది.ఒకవేళ మినహాయింపులు అవసరం అయితే ప్రభుత్వానికి నివేదిక అంద చేయడం తప్పనిసరి.

"పరిశ్రమల ఏర్పాటు కోసం భూములు ఇచ్చిన వారు తగిన అవకాశాలు రాక ఇబ్బందులు పడటం ప్రభుత్వాన్ని కదిలించింది. అంతే కాకుండా వారిని వలసల నుంచి కాపాడటానికి ఈ చట్టం ఉపయోగపడుతుందని జగన్ నేతృత్వంలోని కేబినెట్ భావిస్తోంది. పరిశ్రమలు నెలకొల్పి ఈ చట్టం అమలు చేస్తే ఉద్యోగాలకోసం యువత మెట్రోపాలిటన్ నగరాలు, దుబాయ్,కువైట్ వెళ్లేపరిస్థితి ఉండకపోవచ్చు.

పారిశ్రామిక వేత్తలు ఎక్కడ పరిశ్రమలు పెట్టినా కార్మికులు తమ హక్కులను అమలు చేయమని అడగకుండా ఉండేందుకు ఇతరప్రాంతాల నుంచి కార్మికులను, ఇతర ఉద్యోగులను రిక్రూట్ చేసుకుంటారు. ఉదాహరణకు అమరావతి నిర్మాణంలోని కార్మికులంతా బీహార్,ఒడిశా, పశ్చిమ బెంగాల్ నుంచి తీసుకువచ్చారు. దీంతో స్థానికులు భూములిచ్చి, పనులు లేక నానా విధాలుగా అగచాట్లు పడుతున్న విషయం తెలిసిందే. రాష్ట్రంలోకి కియా మోటార్ల తెచ్చామని చంద్రబాబు ప్రభుత్వం గొప్పలు చెప్పుకున్నప్పటికీ స్థానికులకు దక్కింది స్వీపర్, సెక్యూరిటీ గార్డు ఉద్యోగాలు మాత్రమే.. విదేశాల నుంచి వచ్చిన వారి జీవన శైలిని,ఇళ్లను పరిశీలించడానికి గాని, వారి దగ్గర్లోని హోటళ్లను దర్శించడానికి కూడా మీడియాకు సైతం ప్రవేశంలేదు.. దీనిపై మరొక వర్గం సన్నాయి నొక్కులు వినిపిస్తూ ఇతర రాష్ట్రాలు కూడా ఇదే తరహా చట్టాలను అమలు చేస్తే ఇతరరాష్ట్రాల లోని తెలుగువారి పరిస్థితి ఏంటి అని ప్రశ్నిస్తున్నారు.. వాళ్లందరికీ ఒకే సమాధానం ఏమంటే ..ఏరాష్ట్రం ప్రజలపై ఆయా ప్రభుత్వాలు శ్రద్ధ తీసుకుంటే వలసలు తద్వారా వచ్చే సంక్లిష్ట పరిస్థితులు తగ్గుతాయి. మనిషికి ఆత్మవిశ్వాసం ఏర్పడుతుంది. ఒకవేళ అంతర్జాతీయంగా ప్రావీణ్యం గల వ్యక్తులు ఉంటే వారిని వదులుకోవడానికి ఏ రాష్ట్రమూ, ఏదేశమూ ఒప్పుకోదు.. ఈ సమయంలో పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలి. సామాన్యుడికి పనికల్పించే విధంగా చర్యలు చేపట్టడం ముదావహం. దీనిని మనమంతా స్వాగతిద్దాం..

# కర్ణాటకలో కొనసాగుతున్న రాజకీయ సంక్షోభం



కర్ణాటకలో మూడు వారాల కుమారస్వామి ప్రభుత్వ అనిశ్చితికి తెరపడినప్పటికీ రాష్ట్ర రాజకీయాలు కొలిక్కిరాలేదు. భారతీయ జనతాపార్టీ సారథ్యంలో కొత్తగా ఏర్పడిన బీజేపీ ప్రభుత్వం సోమవారం బలపరీక్షకు సిద్ధం కావాల్సి ఉంది. దీనిమనుగడపై కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి డీకే శివకుమార్ బీజేపీ ప్రభుత్వం ఎన్నిరోజులు ఉంటుందో.. ఎవరికి తెలుసు? అని అనడం సంచలనంగా మారింది. బీజేపీ ప్రభుత్వం పూర్తిస్థాయిలో కొనసాగుతుందని మాత్రం తాను అనుకోవట్లేదని అన్నారు. ఎప్పుడు? ఎవరు? ఏదైనా చేయొచ్చని చెప్పడం గమనార్హం. తిరుగుబాటు ఎమ్మెల్యేలను నమ్ముకుని బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతోందని, వారిని నమ్ముకుంటే ఆ పార్టీ నట్టేట మునుగుతుందని కూడా అన్నారు. ఇప్పుడు తిరుగుబాటు లేవనెత్తిన కాంగ్రెస్, జేడీఎస్ ఎమ్మెల్యేలు బీజేపీలోనూ కుంపట్లు పెడతారని గమనించాలన్నారు. వారిపై అనర్హత వేటు వేయాలని తాను ఇదివరకే స్పీకర్ రమేష్‌కుమార్‌కు విజ్ఞప్తి చేశానని అన్నారు. తిరుగుబాటు ఎమ్మెల్యేలు అందరూ మంత్రి పదవులను ఆశిస్తున్నారని, వారిని నియంత్రించగల సత్తా అమిత్ షాకు లేదని డీకే తేల్చి చెప్పారు. రెబెల్స్‌లో ఒక్క మహేష్ కుమటల్లి మాత్రమే పశ్చాత్తాప పడుతున్నట్లు తెలిసిందని అన్నారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన క్షణం నుంచి తిరుగుబాటు ఎమ్మెల్యేలు మంత్రి పదవుల కోసం యడియూరప్పకు కంటి మీద కునకు లేకుండా చేయడం ఖాయమని అన్నారు. రాత్రి, పగలు అనే తేడా లేకుండా ఆయనను హింసిస్తారని డీకేశివకుమార్ చెప్పారు. ఒకరు ప్యాంటు జేబు, ఇంకొకరు షర్టు జేబు కత్తిరించి పారేస్తారని చురకలు అంటించారు. ఓ స్నేహితునిగా తాను ఆయనను ముందే హెచ్చరిస్తున్నానని అన్నారు. తిరుగుబాటు ఎమ్మెల్యేలను నమ్మకోవద్దని పదే పదే సూచిస్తున్నానని చెప్పారు. అయితే తమను మాజీ కాంగ్రెస్ ముఖ్యమంత్రి సిద్దరామయ్యే కుమారస్వామికి దూరంగా ఉండమన్నారని కాంగ్రెస్ తిరుగుబాటు దారులు బాంబు పేల్చారు. దీనిపై స్పందించిన సిద్దరామయ్య తనమీద లేని పోని అభాండాలు వేస్తున్నారని వాటిని ఖండించినా ప్రజల్లో అనుమానాలు మాత్రం పోవడం లేదు..

2018 మే లో ఇదే యడియూరప్ప ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు అవకాశం వచ్చింది. కానిఅప్పట్లో... బీజేపీకి మెజార్టీ సరిపోలేదు. అదే సమయంలో చేతులు కలిపిన కాంగ్రెస్, జేడీఎస్ పావులు కదిపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. ఇటీవల ఆ సంకీర్ణ ప్రభుత్వం నుంచీ 15 మంది ఎమ్మెల్యేలు రెబెల్స్‌గా మారి ముంబైలో తిష్టవేశారు. మరో ఐదుగురు కూడా ప్రభుత్వానికి మద్దతు వెనక్కి తీసుకున్నారు. ఫలితంగా... 20 మంది ఎమ్మెల్యేలు అసెంబ్లీకి రాకపోవడంతో... బల నిరూపణలో 99 మంది సభ్యుల మద్దతే ఉండటంతో... కుమారస్వామి ప్రభుత్వం కుప్పకూలింది. అసెంబ్లీలో 103 అనేది మేజిక్ మార్క్. బీజేపీకి సొంతంగానే 105 మంది సభ్యుల మద్దతు ఉండటం వల్ల ఆ పార్టీ ప్రభుత్వ ఏర్పాటు చేసింది.

**30 లోపు బలనిరూపణ కాకపోతే మధ్యంతరమే..**

కర్ణాటక కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మాట్లాడుతూ 30 లోగా భారతీయ జనతాపార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సి ఉంటుందని, ఆ గడువు దాటితే- మధ్యంతర ఎన్నికలు తప్పవని ఆయన సంచలన ప్రకటన చేశారు. దీనిపై తన వద్ద పక్కా సమాచారం ఉందన్నారు. సిద్ధరామయ్య తాజాగా చేసిన ప్రకటనకు, ఇంత హడావుడిగా ఆయన ప్రమాణ స్వీకారానికి పూనుకోవడానికి లింక్ ఉన్నట్టే కనిపిస్తోంది.. ఏది ఏమైనా కర్ణాటక రాజకీయం ఏ మలుపు తిరుగుతుందో వేచి చూడాల్సిందే..

– ఖాన్

# 1,26,728 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు



(మొదటిపేజీ తరువాయి)

చేసుకుంటూ మొత్తం 22 రకాల ఉద్యోగాలను సర్కారు భర్తీచేస్తుంది.

**మూడు ప్రత్యేక వెబ్‌సైట్ల ద్వారా..**

కాగా, ఆయా ఉద్యోగాలకు అర్హులైన నిర్యుదోగ యువత నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించేందుకు gramasachivalayam. ap. gov. in, vsws. ap. gov. in, wardsachivalayam. ap. gov. in అనే మూడు ప్రత్యేక వెబ్‌సైట్లను సిద్ధంచేశారు. శనివారం ఉ.11 గంటల నుంచి ఇవి దరఖాస్తుదారులకు అందుబాటులోకి వస్తాయని పంచాయతీరాజ్, పట్టణాభివృద్ధి శాఖ అధికారులు చెబుతున్నారు. నిర్ణీత ఫార్మాట్‌లో దరఖాస్తు ఫారం, 22 రకాల ఉద్యోగాలకు వేర్వేరుగా ఏ ఉద్యోగానికి ఏయే విద్యార్హతలు, వయో పరిమితి, ఎంపిక విధానం, రాత పరీక్షకు సంబంధించిన సిలబస్ వంటి వివరాలను ఆయా వెబ్‌సైట్లలోనే అందుబాటులో ఉంచుతారు.

**రెండంచెల పరీక్ష విధానం..**

అన్ని రకాల ఉద్యోగాల భర్తీకి రెండంచెల పరీక్ష విధానం నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. ప్రతి ఉద్యోగానికి 150 మార్కులకు రెండు పేపర్ల విధానంలో రాతపరీక్ష నిర్వహిస్తారు. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు కేటాయిస్తారు. తప్పు సమాధానానికి నెగిటివ్ మార్కింగ్ విధానాన్ని కూడా ప్రవేశపెట్టనున్నారు. గ్రామ సచివాలయాల్లో పనిచేయడం కోసం భర్తీచేసే వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్, మహిళా పోలీసు, వేల్ఫేర్ మరియు ఎడ్యుకేషన్ అసిస్టెంట్ పోస్టులకు ఉదయం 75 మార్కులకు జనరల్ నాలెడ్జిలో, సాయంత్రం 75 మార్కులకు రీజనింగ్, మెంటల్ ఎబిలిటీ అంశాలపై పరీక్ష నిర్వహిస్తారు. అలాగే, ఏఎన్ఎం, సర్వే అసిస్టెంట్, ఇంజనీరింగ్ అసిస్టెంట్, పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్, విలేజ్ ఫిషరీస్ అసిస్టెంట్, విలేజీ అగ్రికల్చర్ అసిస్టెంట్, విలేజీ హార్టికల్చర్ అసిస్టెంట్, విలేజీ సెరికల్చర్ అసిస్టెంట్ పోస్టులకు ఉదయం 50 మార్కులకు జనరల్ నాలెడ్జిపై.. సాయంత్రం వంద మార్కులకు రీజనింగ్, మెంటల్ ఎబిలిటీతో పాటు ఆయా ఉద్యోగానికి సంబంధించిన అంశాలపై పరీక్ష ఉంటుంది.

**కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వెయిటేజీ**

కాగా, ఇప్పటికే ఆయా శాఖల్లో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పద్ధతిన పనిచేస్తూ నోటిఫికేషన్‌లో పేర్కొన్న మేరకు వారికి అర్హత ఉండి రాత పరీక్షకు హాజరైతే.. అలాంటి అభ్యర్థులకు వెయిటేజీ ఇవ్వాలని అధికారులు నిర్ణయించినట్లు సమాచారం. ఒక్కో ఉద్యోగానికి ఆ శాఖలో ఉన్న నిబంధనలకు అనుగుణంగా ఈ వెయిటేజీ వేర్వేరుగా ఉంటుంది.

**9,359 లైన్‌మెన్ పోస్టుల భర్తీ కూడా.**

ఇదిలా ఉంటే.. 9,359 ఎనర్జీ అసిస్టెంట్ (లైన్‌మెన్) ఉద్యోగాల భర్తీకి కూడా వేరుగా నోటిఫికేషన్ రానుంది. విద్యుత్ డిస్కంలు దీనిని జారీచేస్తాయని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. గ్రామ సచివాలయాల్లో పనిచేసేందుకు 5,573 గ్రామ ఎనర్జీ అసిస్టెంట్ పోస్టులను, వార్డు సచివాలయాల్లో పనిచేసేందుకు 3,786 వార్డు ఎనర్జీ సెక్రటరీ పోస్టులను డిస్కంలు వేరుగా భర్తీచేస్తాయి. ప్రభుత్వ ఉద్యోగ నియామక నిబంధనలకు, డిస్కం ద్వారా చేపట్టే ఉద్యోగ నియామకాల తీరు వేర్వేరు కావడంతో అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారని తెలిసింది. ఈ నోటిఫికేషన్ కూడా ఒకట్రెండు రోజుల్లో వెలువడే అవకాశం ఉందని అధికార వర్గాలు పేర్కొన్నాయి.

**గ్రామ సచివాలయాల సంఖ్య పెంపునకు ప్రతిపాదన**

మొదట 11,114 గ్రామ సచివాలయాలను ఏర్పాటుచేయాలని సర్కారు నిర్ణయించగా.. తాజాగా ఆ సంఖ్యను 11,158కు పెంచాలని కోరుతూ పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ గిరిజా శంకర్ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. విశాఖపట్నం, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, వైఎస్సార్ కడప, కర్నూలు జిల్లాలో మొదట ప్రతిపాదించిన వాటి కన్నా కొన్ని అదనంగా గ్రామ సచివాలయాల ఏర్పాటుకు ప్రతిపాదించారు.

# అవినీతికి అడ్డుకట్ట

(మొదటిపేజీ తరువాయి)

టీమ్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుంది. జడ్జి కోరితే వేరేవారిని కూడా నియమిస్తుంది. వారికి జీతభత్యాలు ప్రభుత్వమే చెల్లిస్తుంది.

- ప్రజల నుంచి అందే సూచనలు, సలహాలను న్యాయమూర్తి ఆధ్వర్యంలోని టెక్నికల్ బృందం 8 రోజుల పాటు సమీక్షిస్తుంది. సంబంధిత శాఖల అధికారులను పిలిచి అందుకు అనుగుణంగా టెండర్లలో మార్పులు చేర్పులు సూచిస్తుంది.
- వారం రోజులు ప్రజా బాహుళ్యంలో, 8 రోజుల పాటు న్యాయమూర్తి పరిశీలనలో టెండర్ డాక్యుమెంట్ ఉంటుంది.
- మొత్తం 15 రోజుల్లో ప్రక్రియ పూర్తవుతుంది.
- న్యాయమూర్తి సూచించిన మార్పుచేర్పులను తప్పనిసరిగా అమలు చేస్తూ టెండర్లను పిలుస్తారు.

**ఇదీ ప్రభుత్వ ఉద్దేశం...**

"ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం పారదర్శకతతో కూడిన వేగవంతమైన మౌలిక సదుపాయాల అభివృద్ధికి కృషి చేస్తోంది. సమాన అవకాశాలు, వ్యయం, నాణ్యతా సూత్రాలను పాటిస్తూ సమర్థవంతమైన రీతిలో ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలను కల్పించాలని ధృఢంగా నిర్ణయించింది. ఈ లక్ష్యాలను సాధించేందుకు యావత్తు మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను మరీ ముఖ్యంగా రూ.100 కోట్లు అంతకు మించిన విలువ గల ప్రాజెక్టుల పర్యవేక్షణ కోసం సమగ్ర చట్టం తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఇందుకోసం ఉన్నత న్యాయస్థానానికి చెందిన గౌరవ న్యాయమూర్తి ఆధ్వర్యంలో తగిన యంత్రాంగం ఏర్పాటుకు చట్టం తేవాలని నిర్ణయించింది. గౌరవ న్యాయమూర్తి విధులు నిర్వర్తించడానికి అవసరమైన నిపుణులు, సిబ్బందిని ఆయన కోరిన విధంగా సమకూర్చుతుంది"

**కొత్త చట్టం పరిధిలోకి వచ్చేవి (పీపీపీ ప్రాజెక్టులతో సహా )**

- రోడ్లు (రాష్ట్ర రహదారులు, మేజర్ జిల్లా రోడ్లు, ఇతర జిల్లా రోడ్లు, గ్రామీణ రోడ్లు) వంతెనలు, బైపాస్‌లు
- ఆరోగ్యం
- భూమిని తిరిగి తీసుకొనుట
- కాలువలు, ఆనకట్టలు
- నీటిని సరఫరా చేయటం, శుభ్రపరచటం, పంపిణీ చేయుటం
- వ్యర్థ పదార్థాల నిర్వహణ
- మురుగు, మురుగుపారుదల
- పబ్లిక్ మార్కెట్లు
- వర్తక ప్రదర్శన, సమ్మేళం, వస్తు ప్రదర్శన, సాంస్కృతిక కేంద్రాలు
- పబ్లిక్ భవనాలు
- దేశీయ జల రవాణా
- గ్యాస్, గ్యాస్ పనులు
- క్రీడలు, విహారాల మౌలిక సదుపాయాలు, పబ్లిక్ ఉద్యానవనములు, పార్కులు
- రియల్ ఎస్టేట్
- ఇగవర్నెన్స్ ప్రాజెక్టులు, ఐటీ మౌలిక సదుపాయాలు
- ప్రైవేట్ రంగ కంపెనీలు, కంపెనీల కన్సార్టియంతో ఉమ్మడి అభివృద్ధి ఒప్పందం, జాయింట్ వెంచర్ ద్వారా పట్టణాభివృద్ధి
- ఫైబర్ గ్రిడ్, వైఫై సర్వీసులతో సహా టెలి కమ్యునికేషన్, బ్రాడ్ బ్యాండ్ ఇంటర్నెట్ సర్వీసులు
- పునరుత్పాదక (సౌరపవన) ఇంధన ప్రాజెక్టులతో సహా విద్యుత్ ఉత్పాదన, ప్రసారం, పంపిణీ
- హైవే ప్రాజెక్టులలో ఏకీకృత భాగంగా ఉన్న గృహ నిర్మాణం లేదా ఇతర కార్యకలాపాలతో సహా ఇతర హైవే ప్రాజెక్టులు
- ట్రాన్స్‌పోర్ట్ టెర్మినల్స్, డిపోలు
- పట్టణ రవాణా ప్రాజెక్టులతో సహా రైల్వే వ్యవస్థ
- ఓడ రేవులు, అంతర్‌దేశీయ ఓడరేవులు
- లాజిస్టిక్ హబ్‌లు స్వేచ్ఛా వాణిజ్య ప్రదేశాలతో సహా పరిమితి లేకుండా వాటికి విమానాశ్రయాలు
- ఆకర్షణీయ నగర ప్రాజెక్టులతో సహా పట్టణాభివృద్ధి ప్రాజెక్టులు
- విద్యా సంస్థలు

# 31 తర్వాత పోలవరం టెండర్లు!

(మొదటిపేజీ తరువాయి)


ఈ నివేదికను జత చేసే అవకాశం ఉందని సమాచారం.

**జెన్‌కో బోర్డులో తుది నిర్ణయం :** ఈ నెల 31న జెన్‌కో బోర్డు సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. జల విద్యుత్కేంద్రం టెండర్లపై ఈ బోర్డు తుది నిర్ణయం తీసుకోనుంది. తాజా అంశాలు, నిపుణుల కమిటీ నివేదికలపై సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటారు. టెండర్లు రద్దు చేసే అంశం కమిటీ నివేదికలో ఉన్నందున తదనుగుణంగా బోర్డు నిర్ణయాలు తీసుకున్న వెంటనే కొత్త టెండర్ల ప్రక్రియ చేపట్టేందుకు ముందడుగు వేయనున్నారు. పోలవరం ప్రధాన డ్యాం, విద్యుత్కేంద్రానికి కలిపి టెండర్లు పిలిచేందుకు జలవనరుల శాఖ రంగం సిద్ధం చేస్తోంది.

**పోలవరం పనులు నిలిపేయండి: బీజేడీ ఎంపీ**

పోలవరం ప్రాజెక్టు పనులను నిలిపివేయాలని బిజూ జనతాదళ్ (బీజేడీ) ఎంపీ సస్మిత్ పాత్ర రాజ్యసభలో డిమాండ్ చేశారు. ఈ ప్రాజెక్టు వల్ల ఒడిశా రాష్ట్రంలో 6,818 మంది నిర్వాసితులవుతారని ఇందులో 5,919 మంది గిరిజనులని తెలిపారు. న్యాయస్థానాల్లో విచారణలు జరుగుతున్నా ప్రాజెక్టు పనులు చేపట్టేందుకు అనుమతించారని ఆరోపించారు.


# బియ్యం కంటే సంచులే ఖరీదు



**రాజధాని వార్తలు, అమరావతి :** ప్రభుత్వం అందిస్తున్న బియ్యం ద్వారా వచ్చే ఆదాయం కంటే కూడా.. దానికి వినియోగించే సంచి కోసం పెట్టే ఖర్చు భారీగా ఉండటం ఆశ్చర్యానికి గురి చేసే అంశం. ఐదు కేజీల బియ్యం రూ.5 చొప్పున ప్రభుత్వం వసూలు చేస్తుంటే.. అదే ఐదు కేజీల బియ్యాన్ని ప్యాక్ కోసం రూ.9 ఖర్చు చేయటం షాకింగ్‌గా మారింది. అంతే కాదు పది కేజీల బియ్యాన్ని ప్యాక్ చేసే సంచికి రూ.12.. 20 కేజీల బియ్యం సంచి కోసం రూ.14 ఖర్చు చేయటం సంచలనంగా మారటమే కాదు.. ఏపీ ప్రభుత్వాన్ని వేలెత్తి చూపేలా ఉందని చెప్పక తప్పదు. ప్రస్తుతానికి సంచుల్లో బియ్యాన్ని లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు వీలుగా ప్రయోగాత్మకంగా శ్రీకాకుళం పట్టణంలో ఈ కొత్త విధానాన్ని అమలు చేస్తున్నారు. అనంతరం రాష్ట్రం మొత్తం ఇదే విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించారు. లబ్ధిదారుల ఇళ్లకే బియ్యాన్ని డోర్ డెలివరీ చేయాలని జగన్ ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా సంచుల్లో బియ్యాన్ని సరఫరా చేయాలని నిర్ణయించారు.. ఇదంతా బాగానే ఉన్నా.. కేవలం సంచులకే వందల కోట్లు ఖర్చు కావటం విమర్శలకు తావిస్తోంది. అంచనా ప్రకారం సంచుల కోసం ఏటా రూ.750 కోట్లు ఖర్చు పెట్టాల్సి వస్తుందని చెబుతున్నారు. ఇంత భారీ మొత్తం కేవలం ప్యాక్ చేసిన బియ్యం కోసం అంటే అదనపు భారం కిందకే వస్తుంది. ఆ ఖర్చుతో ఇప్పుడిస్తున్న బియ్యానికి బదులుగా సన్న బియ్యం ఇస్తే మరింత ప్రయోజనకరంగా ఉంటుందన్న సూచనలు వినిపిస్తున్నాయి. లబ్ధిదారుల ఇళ్లకు సంచుల్లో బియ్యాన్ని అందించటం బాగున్నా.. సంచుల కోసం ఇంత భారీగా ఖర్చు చేయటం ప్రభుత్వంపై వేలెత్తి చూపించే వీలుంది. ఈ సంచుల వ్యవహారంపై జగన్ ఒకసారి దృష్టి సారిస్తే మంచిదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# జెరుసలేంకు జగన్... అమెరికాకు చంద్రబాబు





**రాజధాని వార్తలు , అమరావతి :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్ మొదటిసారిగా విదేశీ పర్యటనకు వెళ్తున్నారు. ఆగస్టు 1 నుండి 4 వరకు జెరుసలేంలో కుటుంబం తో పర్యటించి రాష్ట్రానికి తిరిగిరానున్నారు. జగన్ వెంట వ్యక్తిగత సిబ్బందితో పాటు ఎస్ ఎస్ జీ ఎస్పీ సెంథిల్ కుమార్ – సీఎం వ్యక్తిగత భద్రతా అధికారి జోషి వెళ్లనున్నారు. ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో ఘనవిజయం అనంతరం వైయస్సార్సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో సీఎం. వైఎస్. జగన్ మోహన్ రెడ్డి జెరూసలేం పర్యటన చేస్తున్నట్లుగా ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. పర్యటనలో భాగంగా ఇజ్రాయెల్ లోని క్రైస్తవ పవిత్ర స్థలాలతో పాటు క్రీస్తు జన్మస్థలం బెత్లహేంను సైతం సీఎం జగన్ సందర్శిస్తారు.

ప్రతిపక్ష నేత చంద్రబాబు కూడా విదేశీ పర్యటనలకు వెళ్తుండడంతో తాత్కాలికంగా రాజకీయ వేడి తగ్గే సూచనలు కనిపిస్తున్నాయి. ప్రతిపక్ష నేత – టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు నేడు (ఆదివారం) అమెరికా వెళ్లనున్నారు. ఆయన హైదరాబాద్ నుంచి అమెరికా వెళ్తారు. ఆదివారం అమెరికా వెళ్లి మళ్లీ ఆగస్టు 1 అంటే గురువారం రాష్ట్రానికి వచ్చేస్తారు. చంద్రబాబు వైద్య పరీక్షల కోసం అమెరికా వెళ్తున్నట్లు టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. మొత్తానికి జులై 28 నుంచి ఆగస్టు 1వ తేదీ వరకు చంద్రబాబు.. 1 నుంచి 4 వరకు జగన్ రాష్ట్రంలో ఉండకపోవడంతో రాజకీయ వేడి కాస్త తగ్గుతుందని విశ్లేషకులు అంటున్నారు.

# విశాఖలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ?

**రాజధాని వార్తలు, అమరావతి :** ఏపీ సీఎం జగన్ తొలిసారి హాజరయ్యే స్వాతంత్ర్య వేడుకలు విశాఖలో నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. ఆయన ముఖ్యమంత్రి హోదాలో అధికారుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తే చూడాలని వైసిపి నేతలు, రాష్ట్ర ప్రజలు ఎదురుచూస్తున్న విషయం తెలిసిందే.. ముఖ్యమంత్రి అయిన తర్వాత నిర్వహించబోతున్న తొలి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేస్తోంది. ఏపీ రాజధాని అమరావతి కాబట్టి సహజంగానే అమరావతిలోనే ప్రభుత్వం నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరగాలి .. కానీ ఏదో ఒక ప్రాంతానికే అభివృద్ధి పరిమితం కాకుండా ఉండాలనే ఉద్దేశంతో పాటు అన్ని ప్రాంతాలు తమకు సమానమనే సందేశం ఇవ్వటానికే సాగర తీరంలో ఆగస్టు 15 వేడుకలు నిర్వహించాలని జగన్ ప్రభుత్వం భావిస్తున్నట్లు సచివాలయ వర్గాలు చెబుతున్నాయని సమాచారం. ఇప్పటికే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సంబంధించి విశాఖ జిల్లా అధికార యంత్రాంగం బిజీగా ఉండటంతోపాటు, సెక్రటేరియట్ వర్గాల నుంచి ఆగస్టు 15కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే కార్యక్రమానికి ఏర్పాట్లు చేయవలసిందిగా జిల్లా యంత్రాంగానికి సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది.

# కశ్మీర్‌లో భారీగా బలగాలు మోహరింపు

**రాజధాని వార్తలు, శ్రీనగర్/ న్యూఢిల్లీ :** కశ్మీర్‌లో ఉగ్రవాదకార్యకలాపాలకు చెక్ పెట్టాలన్న ఉద్దేశంతో కేంద్రం ముందస్తు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగానే 10వేల ట్రూపుల పారామిలటరీ బలగలాలను జమ్ముకశ్మీర్‌కు పంపింది. రెండు రోజులుగా జమ్ముకశ్మీర్‌లో ఉన్న జాతీయ భద్రతా సలహాదారుడు అజిత్ దోవల్ ఢిల్లీకి తిరిగి చేరుకోగానే జరగడంతో ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే జమ్ముకశ్మీర్‌లో సీనియర్ ఉన్నతాధికారులతో సమావేశమై శాంతిభద్రతలపై వారితో చర్చించిన తర్వాతే దోవల్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ప్రస్తుతం జమ్మూ కశ్మీర్ రాష్ట్రపతి పాలనలో ఉంది. ఉత్తర కశ్మీర్‌లో ఉగ్రవాద కార్యకలాపాలు ఎక్కువగా జరుగుతున్నందున అక్కడికి బలగాలను పంపాలని తాము ఎప్పుడో విజ్ఞప్తి చేసినట్లు జమ్మూకశ్మీర్ డీజీపీ దిల్‌బాగ్ సింగ్ చెప్పారు. అంతేకాదు అదనంగా బలగాలను అక్కడ పంపుతున్నట్లు కేంద్రహోంశాఖ కార్యాలయం నుంచి ప్రకటన వెలువడింది. వీరంతా శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా రక్షణగా ఉంటారని పేర్కొంది. దేశంలో పలు ప్రాంతాల నుంచి ఈ ప్రత్యేక బలగాలను ప్రత్యేక విమానాల్లో తరలిస్తున్నట్లు కేంద్ర హోంశాఖ తెలిపింది. ప్రత్యేక విమానాల్లో పారామిలటరీ బలగాల తరలింపు ఉత్తర కశ్మీర్‌లో తక్కువ బలగాలు ఉన్నందున అదనంగా 100కంపెనీల బలగాలను ప్రత్యేక విమానంలో తరలిస్తున్నట్లు డీజీపీ దిల్‌బాగ్ సింగ్ తెలిపారు. అమర్‌నాథ్ యాత్ర నుంచి ఈ మధ్యే 40 వేల మందితో కూడిన సైన్యాన్ని కశ్మీర్‌కు తరలించినట్లు చెప్పారు. ఫిబ్రవరి 24న 100 కంపెనీలతో కూడిన సెంట్రల్ పారామిలటరీ బలగాలను కశ్మీర్‌లోయకు తరలించారు. ఏప్రిల్-మే నెలల మధ్య జరిగిన లోక్‌సభ ఎన్నికల కోసం వారిని తరలించడం జరిగిందని ప్రభుత్వం చెప్పుకొచ్చింది. ఆ తర్వాత జమాత్-ఈ-ఇస్లామిపై అనే సంస్థపై నిషేధం విధించింది కేంద్రం ప్రభుత్వం. శాంతి భద్రతల దృష్ట్యా పారామిలటరీ బలగాలను అక్కడకు పంపాము తప్పితే ఇందులో మరో అంశం వేరేది ఏదీ దాగిలేదని డీజీపీ వివరణ ఇచ్చారు.

ఈ మధ్య కాలంలో బీజేపీ జమ్మూ కశ్మీర్‌పై ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. ఇప్పటికే రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాలు ఆ రాష్ట్రంలో పలుమార్లు పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. ఆ తర్వాత అక్కడి రాష్ట్రపతి పాలనను మరికొన్ని రోజులు పొడిగించాలనే నిర్ణయం తీసుకున్నారు. ఇదంతా చూస్తుంటే త్వరలో జమ్మూ కశ్మీర్‌లో ఎన్నికలు నిర్వహించి అక్కడ సైతం కాషాయ జెండాను ఎగురవేయాలనే ఆలోచనలో బీజేపీ ఉన్నట్లు సమాచారం.

మొహమ్మద్ విలాయత్ అలీ సహాయ పౌర సంబంధాల అధికారిగా మచిలీపట్నం నుంచి కాకినాడకు బదిలీ అయ్యారు. అయితే గత సంచికలో పొరపాటున డిప్యూటీ డైరక్టర్‌గా పదోన్నతి పొందారని ప్రచురించటమైనదని చింతిస్తున్నాం.

## 'మృతిచెందిన కార్మిక కుటుంబాలకు రూ50 లక్షల చెల్లించాలి'

**రాజధాని వార్తలు,తుళ్లూరు :** రాజధాని పరిధిలో ఎన్‌సీసీ కంపెనీ నిర్మిస్తున్న ఎమ్మెల్యే క్వార్టర్స్ వద్ద జరిగిన లిఫ్ట్ ప్రమాదంలో చనిపోయిన కార్మికుల కుటుంబాలకు ఒక్కొక్క కుటుంబానికి రూ.50 లక్షలు చెల్లించాలని రాష్ట్ర సీఐటీయూ నాయకులు సీహెచ్ బాబురావు సీఆర్డీఏ, ఎన్‌సీసీ కంపెనీలను డిమాండ్ చేశారు. ప్రమాద స్థలాన్ని సీపీఎం నాయకులు రాయపూడి వచ్చి పరిశీలించారు. ఎన్‌సీసీ సీజీఎం నరసింహమణితో మాట్లాడి బాధిత కుటుంబాలకు అండగా ఉండాలని కోరారు. రాజధాని నిర్మాణ పనులు మొదలైన దగ్గర నుంచి ఎన్‌సీసీ కంపెనీలోనే పెద్ద సంఖ్యలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నట్లు బాబురావు తెలిపారు. ఇంత జరుగుతున్నా లేబర్ ఆఫీసర్లు నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరించటం శోచనీయమన్నారు. ప్రభుత్వాలు చోద్యం చూస్తున్నాయని విమర్శించారు. ఇప్పటికైనా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డిమాండు చేశారు.

## జర్నలిస్టు రక్షణ చట్టాల రద్దు యత్నాలపై ఉద్యమించాలి: ఐజేయూ

**హైదరాబాద్ :** పాత్రికేయుల హక్కుల రక్షణ చట్టాలను రద్దు చేయాలని కేంద్రం చేస్తున్న యత్నాలపై ఉద్యమించాలని జర్నలిస్టులు, పత్రికా సంపాదకులకు ఇండియన్ జర్నలిస్టుల సంఘం (ఐజేయూ) పిలుపునిచ్చింది. పత్రికా స్వేచ్ఛకు విఘాతం కలిగించేలా కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలకు వ్యతిరేకంగా గళమెత్తాలని ఐజేయూ అధ్యక్షుడు, ప్రెస్‌కౌన్సిల్ సభ్యుడు దేవులపల్లి అమర్, సెక్రటరీ జనరల్ సబీనా ఇంద్రజిత్ ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. అధికార పార్టీతో పాటు విపక్ష ఎంపీలంతా కలసి లేబర్‌కోడ్ బిల్లులను పార్లమెంటరీ స్థాయి సంఘానికి లేదా జాయింట్ సెలక్ట్ కమిటీకి పంపించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పదకొండు ఇతర కార్మిక చట్టాలతో పాటు వర్కింగ్ జర్నలిస్టులు, ఇతర వార్తాపత్రికల ఉద్యోగుల (సర్వీస్ నిబంధనలు) అండ్ మిసెలినేలియస్ ప్రొవిజన్స్‌యాక్ట్, 1955, వర్కింగ్ జర్నలిస్టు (ఫిక్సెజేషన్ ఆఫ్ రేట్స్ ఆఫ్ వేజెస్) యాక్ట్, 1958ను రద్దు చేసేందుకు ప్రతిపాదించడాన్ని ఖండించారు. వేజ్ బోర్డును, వర్కింగ్ జర్నలిస్టుల చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్న కార్పొరేట్ శక్తులకు వంతపాడేలా కేంద్రం తీరు ఉందని దుయ్యబట్టారు.

## జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్ ఏడాది కొనసాగింపు

**రాజధాని వార్తలు, అమరావతి :** వర్కింగ్ జర్నలిస్టుల హెల్త్‌స్కీమ్‌ను 2019-20 ఆర్థిక సంవత్సరంలో కూడా కొనసాగించేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఆరోగ్యశ్రీ ట్రస్టు ద్వారా అమలు చేస్తున్న ఈ స్కీమ్‌ను మరో ఏడాది పాటు ప్రభుత్వం కొనసాగించనుంది. దీనికి సంబంధించి చర్యలు తీసుకోవాల్సిందిగా ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈవోకు ఉత్తర్వుల్లో సూచించారు.

# బ్రిటన్ హోం మంత్రిగా ప్రీతి పటేల్

**ఆంధ్రప్రదేశ్‌లోనే కాదు.. బ్రిటన్‌లో కూడా కొత్తగా మహిళాహోం మంత్రి నియమితులయ్యారు. ఆమె భారత్‌లోని గుజరాత్‌కు చెందిన మూలాలున్న వ్యక్తి ప్రీతి పటేల్.. ఆమెకు ప్రధాని మోడీ అంటే అమిత ఆసక్తి .. 20 ఏళ్లనుంచే ఆమె రాజకీయాల్లోకి ప్రవేశించారు. వివాదంలో రెండేళ్ల క్రితం మంత్రిగా ఆమె రాజీనామా చేసినప్పటికీ, కొత్తప్రభుత్వంలో మళ్లీ పదవి దక్కించుకోవడం గమనార్హం.**



బ్రిటన్‌లోని బోరిస్ జాన్సన్ నేతృత్వంలో ఏర్పడిన నూతన ప్రభుత్వంలో భారత సంతతికి చెందిన ప్రీతి పటేల్‌కు హోంమంత్రి పదవి లభించగా, పాకిస్తాన్ మూలాలున్న సాజిద్ జావిద్‌కు ఆర్థిక మంత్రిగా పనిచేసే అవకాశం దక్కింది. దీనికి ముందు పాత ప్రభుత్వంలో సాజిద్ హోంమంత్రిగా ఉన్నారు.

థెరెసా మే ప్రభుత్వంలోనూ మంత్రిగా పనిచేసిన అనుభవం ప్రీతికి ఉంది. అప్పుడు అంతర్జాతీయ అభివృద్ధి మంత్రిగా అభివృద్ధి చెందుతున్న దేశాలకు బ్రిటన్ అందించే ఆర్థిక సహకారానికి సంబంధించిన వ్యవహారాలను ఆమె పర్యవేక్షించేవారు. అయితే 2017లో ప్రీతి ఇజ్రాయెల్‌లో చేపట్టిన 'వ్యక్తిగత' పర్యటన, విదేశాంగ కార్యాలయానికి సమాచారం ఇవ్వకుండా ఆ దేశ ప్రధాని నెతన్యాహు, ఇతర అధికారులతో సమావేశాలు నిర్వహించడం వివాదాస్పదమయ్యాయి. ఈ వ్యవహారం కారణంగా ఆ పదవి నుంచి ప్రీతి తప్పుకోవాల్సి వచ్చింది.ప్రీతి వయసు 47 ఏళ్లు. ఆమె లండన్‌లోనే జన్మించారు. ఆమె తల్లిదండ్రుల స్వస్థలం గుజరాత్. వారు మొదట ఉగాండాలో నివసించేవారు. అయితే, ఉగాండాలో అప్పుడున్న పాలకుడు దక్షిణాసియాకు చెందినవారిపై దేశ బహిష్కరణ విధించారు. దీంతో ప్రీతి తల్లిదండ్రులు బ్రిటన్‌కు వలసవచ్చారు.వైట్‌ఫోర్డ్ గ్రామర్ స్కూల్, వెస్ట్‌ఫీల్డ్ టెక్ కాలేజ్, కీల్ వర్సిటీ, ఎసెక్స్ విశ్వవిద్యాలయాల్లో ప్రీతి చదువుకున్నారు.

20 ఏళ్లు కూడా నిండకముందే ప్రీతి కన్జర్వేటివ్ పార్టీలో చేరారు.కన్జర్వేటివ్ పార్టీ కేంద్ర కార్యాలయంలో ఉద్యోగం కూడా చేశారు. 1995 నుంచి 1997 వరకూ జేమ్స్ గోల్డ్‌స్మిత్ నేతృత్వంలోని రెఫరెండమ్ పార్టీకి ప్రతినిధిగా ఉన్నారు. ఆ పార్టీ యురోపియన్ యూనియన్‌ను వ్యతిరేకించింది.విలియమ్ హేగ్ కన్జర్వేటివ్ పార్టీ అధినేతగా మారిన తర్వాత ప్రీతి తిరిగి ఆ పార్టీలో చేరారు. 1997 నుంచి 2000 వరకూ డిప్యూటీ ప్రెస్ సెక్రటరీగా పనిచేశారు. ప్రముఖ మద్యం తయారీ సంస్థ డియాజియోతోనూ ప్రీతి పనిచేశారు.యురోపియన్ యూనియన్ (ఈయూ)ను విమర్శించినవారిలో ప్రీతి కూడా ఉన్నారు. బ్రెగ్జిట్‌ను ఆమె చాలా బలంగా సమర్థించారు.స్వలింగ వివాహాలను వ్యతిరేకించిన ప్రీతి.. ధూమపానంపై ఆంక్షలు విధించడానికి వ్యతిరేకంగానూ మాట్లాడారు.

2005 ఎన్నికల్లో నాటింగ్‌హామ్ ఎంపీ స్థానానికి పోటీ చేసి ఓడిపోయినా, 2010లో విట్‌హామ్ ఎంపీగా ప్రీతి గెలిచారు. అప్పటి నుంచి ఆమె ఆ స్థానం నుంచి ఎంపీగా ఉన్నారు.డేవిడ్ కేమరూన్ హయాంలో ఓ ఏడాదిపాటు ట్రెజరీ శాఖలో సహాయమంత్రిగా, మరో ఏడాది ఉద్యోగకల్పన శాఖలో మంత్రిగా పనిచేసే అవకాశం ప్రీతికి లభించింది.బ్రిటన్ మాజీ ప్రధాని మార్గరెట్ థాచర్ తనకు ఆదర్శమని ప్రీతి చెబుతుంటారు.

బ్రిటన్ మాజీ ప్రధాని థెరెసా మేను విమర్శించిన ప్రీతి పటేల్,ప్రధాని మోడీ మద్దతుదారు. బ్రిటన్‌లో హోం సెక్రెటరీ అయిన మొదటి భారతీయ మహిళ ఆమే. గుజరాత్‌కి చెందిన ప్రీతి పటేల్... ఇకపై బ్రిటన్‌లో జరిగే అన్ని భారతీయ వేడుకలకు ముఖ్య అతిథి కాబోతున్నారు.

ప్రీతి పటేల్ మొదటి నుంచీ బోరిస్ జాన్సన్ క్యాంపెయిన్‌లో కీలకంగా వ్యవహరించారు. కన్సర్వేటివ్ పార్టీ తరపున ఆమె కీలక నేతగా ఎదిగారు. అధునాతన బ్రిటన్ లక్ష్యంగా... కేబినెట్ ఉండాలని కోరుకున్న ప్రధాని బోరిస్ జాన్సన్ ఆమెకు కీలక పదవి అప్పగించారు.

# మారిషస్‌లో తెలుగు వెలుగు

- తెలుగు రాష్ట్రాలు సహకరించాలి
- మారిషస్ తెలుగు సాంస్కృతిక నిలయం అధ్యక్షుడు నారాయణస్వామి

**రాజధాని వార్తలు, అమరావతి :** మారిషస్‌లో తెలుగు వెలుగుకు తెలుగు రాష్ట్రాల సహకారం అవసరమని మారిషస్ తెలుగు సాంస్కృతిక నిలయం అధ్యక్షుడు నారాయణస్వామి సన్యాసి చెప్పారు. 12 లక్షల జనాభా ఉన్న మారిషస్‌లో లక్ష మంది తెలుగు వారేనన్నారు. గడచిన పదేళ్లలో అక్కడి తెలుగు వారి గురించి పట్టించుకునే వారే లేకుండా పోయారన్నారు. అమరావతి సందర్శనకు వచ్చిన ఆయన విజయవాడలో మాట్లాడారు. మారిషస్ తెలుగు రాష్ట్రాల సీఎంలను కోరనున్నట్టు చెప్పారు. పదేళ్ల నుంచి మారిషస్ తెలుగు సాంస్కృతిక నిలయం అధ్యక్షునిగా కొనసాగుతున్న నారాయణస్వామి సన్యాసి ఇంకా ఏమన్నారంటే.. "శతాబ్దాల తరబడి మారిషస్‌లో తెలుగువారంటున్నారు. ఉమ్మడి మద్రాస్ సమయం నుంచే ఎంతోమంది ఉపాధి కోసం వలస వచ్చి మారిషస్‌లోనే స్థిరపడ్డారు. దశాబ్దాల క్రితం వరకు తెలుగుకు ఆదరణ లభించేది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సీఎంలు, మంత్రులు అప్పుడప్పుడు తెలుగు వారు నిర్వహించే సభలు, వేడుకలకు హాజరయ్యే వారు. అయితే దాదాపు పదేళ్ల నుంచి అధికారికంగా తెలుగు వారిలో భాషపై మమకారం సన్నగిలుతోంది. వచ్చే తరం వారికి తెలుగంటే ఏమిటో, సంస్కృతి, సంప్రదాయాలేమిటో తెలియని పరిస్థితి వస్తుం దన్నదే మా ఆందోళన. ఆ ప్రమాదం తలెత్తకూడదన్నదే తమ తపన అని" అన్నారు.

**ముఖ్యమంత్రి జగన్‌ను ఆహ్వానిస్తాం..**

వచ్చే ఏడాది మారిషస్‌లో జరిగే తెలుగు మహాస భలకు ముఖ్య అతిథులుగా పాల్గొనాలని ఆంధ్రప్రదేశ్ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌లను ఆహ్వానిస్తా మని నారాయణస్వామి చెప్పారు. త్వరలో మా ప్రతినిది బృందంతొ వచ్చి తెలుగు రాష్ట్రాల సీఎంలను కలుస్తామని, ఉగాది ఉత్సవాలకు కూడా హాజరుకావాలని కోరతామన్నారు.



**ప్రతిభావంతులను ప్రోత్సహించాలి**

మారిషస్‌లో తెలుగు భాష మరింతగా విరాజిల్లేందుకు, సంస్కృతిని కాపాడేందుకు మారిషస్‌లో ప్రతిభావంతులైన తెలుగు విద్యార్థులను ప్రోత్స హించడానికి తెలుగు రాష్ట్రాలు స్కాలర్‌షిప్‌లు అందజేయాలన్నారు. తెలుగు సంస్కృతి విస్తృతికివీణ, మృదంగం, వయోలిన్, ఘటం వంటి వాయిద్య పరికరాలతోపాటు కూచిపూడి నృత్యం, కర్నాటక సంగీతాలకు శిక్షణనిచ్చే వారిని సయకూ ర్చాలన్నారు. ఉగాది ఉత్సవాలు నెల రోజులు నిర్వహిస్తామని, సాంస్కృతిక బృందాలను పంపాలని కోరారు. మారిషస్‌లో ఎస్‌వీబీసీ ప్రసారాలకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కోరతామని నారాయణస్వామి తెలిపారు.

## గ్రామాల అరుణపతాకం రెపరెపలాడాలి

**రాజధాని వార్తలు,తాడికొండ:** గ్రామాల్లో అరుణప తాకం రెపరెపలాడాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ అన్నారు. పొన్నెకల్లులో సీపీఐ కార్యాలయంలో జరుగుతున్న కార్యకర్తలు శిక్షణ శిబిరం ముగింపు సభకు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీలో ప్రజాప్రతినిధులు అరాచ కంగా వ్యవహరిస్తున్నారని ఒకరిపై ఒకరు దూషణలు చేసుకుంటూ ప్రజా ప్రతినిధులన్న సంగతి మరిచిపోతున్నారని అన్నారు. రాష్ట్రంలో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సీపీఐ రాజధాని ప్రాంత కార్యదర్శి పచ్చల సాంబశివరావు మాట్లాడుతూ అమరావతి - అనంత పురం ఎక్స్‌ప్రెస్ హైవే భూసేకరణపై ప్రభుత్వం పరిహారం ప్రకటించాలని డిమాండ్ చేశారు. రైతులకు నచ్చితేనే సర్వే పనులు ప్రారంభించాలని కోరారు. కార్యక్ర మంలో ఏఐటీయూసీ కార్యదర్శి జీవి.రాజు,సీపీఐ నాయకులు ముప్పాళ్ల శివశంకర్, గుర్రంకొండ సత్యానందం, చింతల భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

### మహాకవి గుర్రం జాషువా 48 వ వర్ధంతి సందర్భంగా..

## చర్మకారుడికి జాషువా వందనం...



"ముప్పు ఘటించి
వీని కులమున్
గలిమిన్ గబళించి
దేహమున్ బిప్పి
యెనర్చి నీ భరత
వీరుని పాదం
కందకుండగా జెప్పులు
కుట్టి జీవనం సేయును
గాని నిరాకరింపే
లేదెప్పుడు నప్పుపడ్డది
సుమీ భారతావని వీని
సేవకున్.

## అక్రమ వడ్డీ వ్యాపారులకు అడ్డుకట్ట వేయండి: సీఎస్



**రాజధాని వార్తలు, అమరావతి :** రాష్ట్రంలో అక్రమ వడ్డీ వ్యాపారులు, రిజిష్టర్ కాని బోగస్ చిట్ ఫండ్ కంపెనీలపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యం ఆదేశాలు జారీ చేశారు. సచివాలయంలో జరిగిన ఆర్బీఐ 16వ రాష్ట్ర స్థాయి సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్టాడుతూ వడ్డీ వ్యాపారుల నుంచి ప్రజలు మోసపోకుండా సంబంధిత నియంత్రణ ఏజెన్సీలు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ముఖ్యంగా ప్రజలు వివిధ బ్యాంకులు, చిట్ ఫండ్ కంపెనీలు లేదా ఇతర ఆర్థిక సంస్థల్లో కుదువ పెట్టే ప్రతి పైసాకు భద్రత కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కొన్ని చిట్ ఫండ్ కంపెనీలు డబ్బులు వసూలు చేసి వారి సొమ్ములు తిగిరి చెరిగి చెల్లించకుండా మోసం చేస్తున్న సంఘటనలు తరచూ జరుగుతున్నాయని, వీటిని నివారించేందుకు కేంద్ర, రాష్ట్రాలకు చెందిన శాఖలు, ఏజెన్సీలు చట్టాలను పటిష్టంగా అమలు చేయాలన్నారు. రెండు మూడు నెలలకు ఒకసారి జరిగే ఈ రాష్ట్రస్థాయి సమన్వయ కమిటీ సమావేశం మరింత అర్థవంతంగా నిర్వహించి, అక్రమాలకు పాల్పడేవారిపై సకాలంలో చర్యలు తీసుకునే విధంగా పూర్తి కార్యాచరణ ప్రణాళికతో రావాల్సిన అవసరం ఉందన్నారు. వచ్చే సెప్టెంబరులో నిర్వహించే తదుపరి సమావేశానికి సంబంధిత శాఖలు పూర్తి కార్యాచరణతో రావాలని చెప్పారు. రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ డైరెక్టర్ సుబ్రతా దాస్ మాట్లాడుతూ బ్యాంకింగేతర ఆర్థిక కార్యకలాపాల మోసాలతో ప్రజలు ఇబ్బంది పడకుండా చూడాల్సిన బాధ్యత కేంద్రం. రాష్ట్రశాఖలపై ఉందని పేర్కొన్నారు.

## రాయపూడిలో కొండ చిలువ కలకలం



**రాజధాని వార్తలు, రాయపూడి :** రాయపూడి కరకట్ట రోడ్డు మీద కొండ చిలువ సంచరిస్తుండాగా గ్రామస్తులు దానిని పట్టుకున్నారు. దాపు 9 అడుగుల పొడవు ఉంటుందని వారు తెలిపారు. చంపకుండా కొండ చిలువను ఒక గోనే సంచిలో పెట్టి ఉంచారు. ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇవ్వటానికి ప్రయత్నించగా వారు అందుబాటులోకి రాలేదని గ్రామస్తులు పేర్కొన్నారు. గత మూడు రోజుల నుంచి ఒక మోస్తరు వర్షాలు పడటంతో కలుగులలో ఉన్న పాములు బయటకు రావటం ప్రారంభంచాయి.


# రాజధాని క్లాసిఫైడ్స్

ప్రకటనలకు సంప్రదించండి
**9440662699**

### షాప్స్

తుళ్ళూరు
ఎస్.ఎమ్(స్టైల్ ఫర్ మెన్) ట్రైలర్స్
ఫోన్ 9440307123

తుళ్ళూరు
రేమాండ్స్‌ట్రైలర్స్
ఫోన్ : 9492470426

తుళ్ళూరు
వైభవ్ డ్రస్సెస్
ఫోన్ : 9848407935

తుళ్ళూరు
శ్రీసాయి జ్యూయలరీ వర్క్స్
ఫోన్ :9247171083

కొత్తపల్లి రామయ్య చారిటబుల్ ట్రస్ట్
నూతక్కి గ్రామం, మంగళగిరి మండలం, గుంటూరు జిల్లా,
సెల్ : 9182155644

అరుణోదయ
హెచ్.పి.గ్యాస్ ఏజన్సీ
హుస్సేన్ కట్ట వద్ద,
పాత మంగళగిరి,
9848111905

గుంటూరు
న్యూసిటి లింబ్ సెంటర్
ఫోన్ : 9951066705

**ఇల్లు అమ్మకం**
గుంటూరు నగరంలోని బొంగరాల బీడు ఏరియా లోని స్వాతి పేట, హౌస్ నెంబర్ : 7-6-132, గుంటూరులో.....140 చదరపు గజాల విస్తీర్ణంలోని రెండు రేకుల ఇళ్లు అమ్మ కానికి కలవు. సంప్రదించండి ...99856 58208

తుళ్ళూరు
రాజా గోల్డ్ కవరింగ్
ఫోన్ : 9581500500

రాయపూడి
చంద్రిక ట్రేడర్స్ నిర్మాణ రంగానికి సిమెంట్, స్టీలు,పైపులు అమ్మబడును.
ఫోన్ : 9908073516

రాయపూడి
వర్షిత ఫోటోస్టాట్
ఫోన్ : 9985853188

రాయపూడి
శివ గంగా వాటర్
ఫోన్ : 9618965739

రాయపూడి
ఖాజా ఖాదర్ రైస్ స్టోర్స్
ఫోన్ : 9603990791

వెలగపూడి
సాయి గణేష్ ట్రేడర్స్: నిర్మాణ రంగానికిసిమెంట్, స్టీలు, పైపులు, పెయింట్‌లు అమ్మబడును.
ఫోన్ : 9640811333

రాయపూడి
గోపి గోపిక రెడీమెడ్ గార్మెంట్స్
ఫోన్ : 97031 20890

మంగళగిరి
శ్రీ పూజిత హెయిర్ అండ్ బ్యూటీ
ఫోన్ : 799301511

మంగళగిరి
శ్రీదుర్గా డిజైనర్స్ (లేడీస్ టైలర్స్)
ఫోన్ : 9959308664

విజయవాడ
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘంలిమిటెడ్
ఫోన్ : 0866-2452129

విజయవాడ
స్టార్స్ ఆటోమొబైల్స్
ఫోన్ : 9848518117

రాయపూడి
చైతన్యగోదావరి గ్రామీణ బ్యాంక్
ఫోన్ : 08645-244266

**సాగర్ బోర్ వెల్స్**
సరసమైన ధరలకు మీరు మేచ్చే విధంగా మీ నీటి అవసరాలను తీర్చేందుకు 4 3/4, 6 1/2, రొటరీ, రిగ్గ్ బోర్లు వేయబడును
ప్రొ॥ మల్లవరపు రమేష్ బాబు
మంగళగిరి
7981075683, 9652246869

### హోటల్స్

రాయపూడి
కాకతీయ పుడ్ కోర్ట్
ఫోన్ : 9848021898

మల్కాపురం
స్వాగత్ మెస్ ప్యూర్‌వెజ్
ఫోన్ : 90329 58580

రాయపూడి
వేణుగోపాల రెడిమేడ్స్ ఫాన్సీ & హోమ్ నీడ్స్
ఫోన్ : 98483 83650

రాయపూడి
శ్రీ వేంకటేశ్వర ఫుడ్స్
రుచికరమైన భోజనం
ఫోన్ : 76759 70341

మందడం
ఎస్.ఆర్.కె. గ్రాండ్ రెస్టారెంట్
ఫోన్ : 9553023388

### హస్పటల్స్

విజయవాడ
నవీన డెంటల్ & ఇంప్లాంట్ కేర్
7893187172

విజయవాడ
న్యూఫేస్ కీనిక్ , డా॥మేహబూబ్
ఫోన్ : 9849122788

విజయవాడ
అష్రఫ్ మెటర్నిటీ & ఇ.ఎన్.టి
డా॥ రెహమాన్
ఫోన్:0866-2475087

విజయవాడ
శ్రీమానస సైకియాట్రిక్
డా॥ అయోధ్య ఆర్.కె
ఫోన్:0866-2436647

తుళ్ళూరు
శ్రీనివాస మెడికల్ & ఫ్యాన్సీ స్టోర్స్
ఫోన్ : 9849216110

మందడం
హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్
ఫోన్ : 8008685824

రాజధాని వార్తలు ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజా ప్రతినిధుల పుస్తకం రానుంది.
-9440662699

చినకాకాని
ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజీ & జనరల్ హాస్పిటల్
ఫోన్ : 08645-230101

విజయవాడ
ఆంధ్ర హస్పటల్,
డా॥శ్రీమన్నారాయణ
ఫోన్ : 9177219900

### యూనివర్శిటీ

నీరుకొండ
ఎస్ఆర్ఎమ్ యూనివర్సిటీ
ఫోన్ : 0863 2343000

ఐనవోలు
విఐటి యూనవర్సిటీ
ఫోన్ : 0863 2370444

గమనిక : క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటన దారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.
- మేనేజర్


## నిబంధనలను తుంగలో తొక్కిన 'ఐలా'

**తాజాగా మరోసారి చక్రం తిప్పిన జోనల్ స్థాయి అధికారి**




**రాజధాని వార్తలు, అమరావతి :** విజయవాడ ఆటోనగర్‌లోని ఇండస్ట్రియల్ ఏరియా లోకల్ అథారిటీ(ఐలా) అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నానే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల ఆటోనగర్ ప్రాంతంలో పారిశుద్ధ్య పనులకు ఐలా అధికారులు టెండర్లను ఆహ్వానించారు. గత నాలుగేళ్లుగా టెండర్లు లేకుండానే పారిశుద్ధ్య పనులు చేపట్టిన టీడీపీ వర్గీయులే మళ్లీ టెండర్లు దక్కించుకునేలా ఐలా అధికారులు నిబంధనల్లో మార్పులు చేశారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఐలాకు చెందిన ఓ జోనల్‌స్థాయి అధికారి ఈ వ్యవహారంలో చక్రం తిప్పారన్న వాదన వినిపిస్తోంది. పారదర్శకంగా నిర్వహించాల్సిన టెండర్ల ప్రక్రియ గాడితప్పింది. తమకు అనుకూలురైన వారికే టెండర్లు కట్టబెట్టాలన్న దురుద్దేశంతో విజయవాడ ఆటోనగర్‌లోని ఇండస్ట్రియల్ ఏరియా లోకల్ అథారిటీ(ఐలా) అధికారులు లేని నిబంధనలు సృష్టించినట్లు తెలుస్తోంది. తద్వారా గతంలో పనులు చేపట్టిన వారికే తిరిగి పనులు కట్టబెట్టారన్న వాదన వినిపిస్తోంది.

**ఎక్కడా లేని నిబంధనలు..**

ఆటోనగర్‌లో పారిశుద్ధ్య పనులకు ఐలా అధికారులు ఈ నెల 2వ తేదీన టెండర్లను ఆహ్వానించారు. అయితే ఎక్కడా లేనివిధంగా టెండర్‌లోని నిబంధనలు ఉండటం.. కొంత మంది వ్యక్తులకు లబ్ధి చేకూరేలా వాటిని రూపొందించడం జరిగింది. టెండర్లు ఎవరికి దక్కుతాయో తెలియకుండానే కాంట్రాక్టర్లు వర్కర్ల గుర్తింపు కార్డులు, ఆధార్ కార్డులు జతపరచాలని షరతు విధించారు. డ్వాక్రా సంఘాలకు సంబంధించిన 19 ఏళ్ల ఆడిట్ రిపోర్టు అడిగారు. అలాగే ఆయా సంఘాలకు సంబంధించి జీఎస్టీ సర్టిఫికెట్ జతపర్చమన్నారు. అలాగే ఐలాపై కోర్టుకు వెళ్లిన వారు అనర్హులు అనే నిబంధన కూడా పెట్టారు. వీటిపై గతంలో ఐలా పరిధిలో పారిశుద్ధ్య పనులు చేపట్టిన కొందరు కాంట్రాక్టర్లు ఏపీఐఐసీ డైరెక్టర్‌కు ఫిర్యాదు చేయగా.. ఆ నిబంధనలను సడలిస్తున్నామంటూనే.. గడిచిన ఐదేళ్ల కాలంలో ఎక్కడైనా రూ. 34 లక్షల పారిశుద్ధ్య పనులు చేసినట్లుగా సర్టిఫికెట్‌ను జతపర్చాలని కొత్త మెలిక పెట్టారు. చివరకు తమకు అనుకూలంగా ఉన్నవారికే పనులు దక్కేలా చక్రం తిప్పారు.

**మూడే దరఖాస్తులు.. అందులో ఒకటి డమ్మీ..!**

టెండర్ల ప్రక్రియలో ఐలాకు చెందిన జోనల్ అధికారి ఒకరు చక్రం తిప్పినట్లు సమాచారం. ఈ పనులకు గట్టి పోటీ ఉంటుందని తెలిసి.. గతంలో పనిచేసిన వారికే మళ్లీ పనులు దక్కేలా నిబంధనలు రూపొందించారనే ఆరోపణలు ఉన్నాయి. ఏడాది కాల పరిమితితో 2015లో ఐలా నిర్వహించిన టెండర్లలో గోగినేని ఉమా అనే మహిళ లారీలకు సంబంధించిన చెత్తను తరలించే పనులు దక్కించుకోగా.. కానూరి మణితా అనే మరో మహిళ పారిశుద్ధ్య పనులను దక్కించుకున్నారు. ఆ తర్వాత ఏడాది నుంచి నేటి వరకు నాలుగేళ్లపాటు ఎలాంటి టెండర్లు నిర్వహించకుండానే వారిద్దరికి ఆయా పనులను అప్పగించారు. అప్పటి, ప్రస్తుత టీడీపీ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావుతోపాటు, ఐలా చైర్మన్‌గా వ్యవహరిస్తున్న సుంకర దుర్గాప్రసాద్‌కు వారు సన్నిహితులనే ప్రచారం ఉంది. అందువల్లే వారికి టెండర్ల లేకుండానే పనులు అప్పగించారన్న ఆరోపణలు ఉన్నాయి. తాజాగా శుక్రవారం నిర్వహించిన టెండర్ల ప్రక్రియలో గోగినేని ఉమా, కానూరి మణితాతోపాటు వై.దేవదాస్ అనే వ్యక్తి మాత్రమే దరఖాస్తులు దాఖలు చేయడం గమనార్హం. అయితే వారిద్దరికే మళ్లీ టెండర్లు దక్కితే ఐలాపై విమర్శలు వెల్లువెత్తుతాయన్న కారణంతో చైర్మన్ సూచనల మేరకు వై.దేవదాస్ అనే వ్యక్తితో డమ్మీ దరఖాస్తు దాఖలు చేయించినట్లు తెలుస్తోంది. రెండు పనుల్లోనూ దేవదాస్ దాఖలు చేసిన టెండర్ అనర్హత సాధించడమే ఇందుకు నిదర్శనమని ఐలా అధికారవర్గీయులు గుసగుసలాడుకుంటున్నారు.




# ప్రజాసేవలో ఎన్ఆర్ఐ ఆసుపత్రి



బేబీ కేర్ వార్డు

అంతరిక్షంలో నడిచే సాంకేతికత మన సొంతం అయినా, భూమిపై మమకారం పోదు.. విదేశాల్లో ఆస్తులు,అంతస్తులు, మంచి పేరు ప్రఖ్యాతులు సాధించినా, తన వారికి దూరంగా ఉండిపోయామన్న వేదన వదలదు. ఇలాంటి పరిస్థితినే ఎదుర్కొన్న డాక్టర్. నిమ్మగడ్డ ఉపేంద్రనాథ్ వైద్యశాస్త్రంలో తనకున్న అపారమైన అనుభవాన్ని స్థానిక రైతులకు,సామాన్యులకు అందించాలన్న సత్ సంకల్పంతో మంగళగిరిలో ఎన్ఆర్ఐ ఆసుపత్రిని స్థాపించారు. అందరికీ అందుబాటు ధరల్లో వైద్యాన్ని విస్తృతం చేసి మరింత ఆధునిక సదుపాయాలను కల్పించేందుకు అహరహరం కృషి చేస్తున్న ఆయనతో రాజధాని వార్తలు ఎడిటర్‌తో ముఖాముఖి..



డాక్టర్. నిమ్మగడ్డ ఉపేంద్రనాథ్, ప్రెసిడెంట్ ఎన్ఆర్ఐ హాస్పిటర్ & మెడికల్ కాలేజి

**మీ తల్లిదండ్రులు,స్వస్థలం గురించి చెప్పండి?**

1942లో తెనాలిలో జన్మించాను. మా నాన్నగారు సాంబశివరావు వైద్య వృత్తిలో ఉండేవారు. పిన్న వయస్సులోనే చనిపోయారు. విజయవాడ ఆంధ్రా లయోలా కాలేజీలో బీఎస్సీ చదివాను. ఆపై కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజీలో యంబీబీఎస్ చదివాను. 1964లో ఉషారాణితో నా వివాహమైంది. ఇద్దరికీ రైల్వేలో ఉద్యోగం వచ్చింది. నాకు అమెరికాలో ఆఫర్ రావడంతో అమెరికా వెళ్లిపోయాం.

**అమెరికాలో ప్రత్యేక కోర్సులు ఏమైనా చేశారా ?**

అమెరికాలో హాస్పిటల్ ఇంటర్న్‌షిప్ అయిన తర్వాత జనరల్ సర్జరీలో 5 ఏళ్లు శిక్షణ పొందాను.

**మంగళగిరిలో ఎలా హాస్పిటల్‌ను మొదలుపెట్టారు ?**

అమెరికా తెలుగు సంఘాలలో చాలా చురుకుగా ఉండేవాడిని మంగళగిరిలో సామాన్య ప్రజలకు వైద్యం అందుబాటులో ఉండేది కాదు. అరకొరగా ప్రభుత్వ హాస్పిటల్స్ ఉండేవి. 2000 సంవత్సరంలో భారత విద్యావిధానాలలో పెనుమార్పులు వచ్చాయి. ప్రభుత్వం సరళీకృత విధానాలు తెచ్చింది. దీంతో 2002లో డాక్టర్. చింతమనేని సురేష్ తదితరులు సహకారంతో ఎన్ఆర్ఐ హాస్పిటల్‌ను మొదలు పెట్టాము. 2003లో 100 విద్యార్థులతో తర్వాత150 మంది విద్యార్థులతో, ఈ వైద్యకళాశాల ప్రారంభం అయ్యింది. ఇప్పటి వరకు 5 బ్యాచ్‌ల విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు.

**ఎన్ఆర్ఐ కాలేజీపై మీ అభిప్రాయం ఏమిటి ?**

మంగళగిరిలో ఈ హాస్పిటల్‌ను స్థాపించటం అదృష్టంగా భావిస్తున్నాను. ఇక్కడ సేవలందించడానికి ప్రొఫెసర్లు, డాక్టర్లు ఎంతో మంది అందుబాటులో ఉన్నారు. రాష్ట్ర ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో ఎన్ఆర్ఐకు మంచి పేరుంది. అలాగే ఈ ఆసుపత్రి ద్వారా సమాజంలో కొంత మార్పు తేగలిగాము.

**మెడికల్ కాలేజీలో ఫ్యాకల్టీ ఎలా ఉంది?**

మంచి బోధనా అనుభవమున్న అధ్యాపకులు ఉండటంవల్ల ఎక్కువ మంది విద్యార్థులు ఇక్కడ చదవటానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. ప్రభుత్వం ఇప్పుడు అధ్యాపకుల రిటైర్మెంట్ 70 సంవత్సరాలు చేసింది. దాంతో మరింత మంది అధ్యాపకులు సేవలందించటానికి అందుబాటులో ఉన్నారు.

**ర్యాగింగ్‌లపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?**

కొంత మంది యువకుల దుందుడుకు చర్యల ద్వారా చిన్న సమస్యలు వస్తుంటాయి. మా కాలేజీ అధ్యాపకులు, పోలీసు సహకారంతో ర్యాగింగ్ లాంటివి జరగకుండా చూస్తున్నాం. కొత్తగా చేరిన విద్యార్థులకు అవగాహనా సదస్సులు నిర్వహిస్తున్నాం.

**వైద్యవిద్యలో ఎన్ని సీట్లు ఉన్నాయి? వివరాలు చెప్పగలరా ?**

మా దగ్గర పోస్టు గ్రాడ్యుయేషన్‌తో పాటు 200 యంబీబీఎస్ సీట్లు ఉన్నాయి. 100 సీట్లు ప్రభుత్వం ద్వారాను, మిగతా 100 సీట్లలో 15 ఎన్ఆర్ఐ లకు మిగిలినవి డోనేషన్ సీట్లుగా కేటాయించాం. ప్రతి ఏడాది ఎంసీఐ అర్హతలు అమలుపై ప్రతినిధులు సందర్శిస్తారు. సంతృప్తికరంగా లేకుంటే సీట్లు తగ్గిస్తారు

**రాష్ట్రంలో ఇంజనీరింగ్ కాలేజీ మాదిరిగా వైద్యకళాశాలు ఎక్కువ ఎందుకు లేవు ?**

మెడికల్ కాలేజీలకు అనుమతులు లభించడం కష్టసాధ్యమైన పని. దాదాపు 25 ఎకరాల స్థలం, ఆధునిక భవనాలు, ఫ్యాకల్టీ లభ్యత వ్యయప్రయాసలతో కూడుకుంది.

**ఎన్ఆర్ఐ వైద్యకళాశాల, ఆసుపత్రి స్థాపనతో మీరనుకున్నవి సాదించారా?**

అన్నీ కాదనుకుంటా, కాలేజీలో నాణ్యతగల విద్యను అందించడం సవాల్‌తో కూడుకుంది. అనుభవజ్ఞులైన టీచర్లు అందుబాటులో లేరు. పేషెంట్లు పెరగడంతో ప్రస్తుత భవనాలు, వసతులు సరిపోవట్లేదు. వాటిని విస్తరించాల్సిన అవసరం ఉంది.

**రోగులకు మీ సేవలు వివరించండి..**

సీటీ స్కాన్, ఎంఆర్ఐ లాంటి పరీక్షలు తక్కువ ఫీజులు వసూలు చేస్తున్నాం. 200 మంది విద్యార్థులకు 950 పడకల ఆసుపత్రి ఉంది. మరికొన్ని ప్రైవేటు గదులు నిర్మించే యోచనలో ఉన్నాము.

**అత్యుత్తమ సేవలందించగలిగి వైద్యులు ఎంతమంది ఉన్నారు?**

అనుభవం గల ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, పీజీ విద్యార్థులు ఇక్కడ ఉన్నారు.

**మీరు పర్యవేక్షిస్తుంటారా? సాధారణ ప్రజలు మంచి వైద్యం ఆకాంక్షిస్తారు. ఆదిశగా మీరు ఏం చేస్తున్నారు?**

ఎన్ఆర్ఐ నా పర్యవేక్షణలో కొనసాగుతోంది. అయితే మరిన్ని మెరుగైన సేవలు అందించాలన్న ఉద్దేశ్యంతో ప్రజల నుంచి సూచనలు, సలహాల కోసం బాక్సులు పెట్టాం. వాటితో మరింత మెరుగైన సేవలు అందిస్తాం.

**మీ హాస్పిటల్‌లో విద్యార్థులే వైద్యం చేస్తారని ప్రజలు అనుకుంటున్నారు?**

మాకు హాస్పిటల్‌తో పాటు కాలేజీ ఉంది. వైద్య విద్యార్థులు నేర్చుకోవాలి. వారు పేషెంట్లను ముందుగా చూస్తారు. పరీక్షలను చూస్తారు. తర్వాత డ్యూటీ డాక్టరు చూస్తారు. ఫైనల్‌గా రోగికి ఇన్‌చార్జి డాక్టరు మందులు వ్రాస్తారు. విద్యార్థులు వైద్యం చేస్తారనేది అపోహ మాత్రమే..

**వైద్యులకు- రోగులకు మధ్య ఘర్షణ వాతావరణం ఎందుకు వస్తోంది?**

రోగికి సమయమనేది ముఖ్యం.. కొన్నిసార్లు చివరి నిమిషంలో ఇక్కడికి వస్తారు. దాంతో రోగిని కాపాడగలిగే అవకాశాలు తగ్గిపోతాయి.. డాక్టర్లకు డబ్బే ప్రధానం కాదు.. నిర్లక్ష్యత అస్సలు ఉండకూడదు.

**రోగి రిపోర్టులు ఎందుకు ఆలస్యంగా వస్తున్నాయి?**

చాలా మంది రోగులు రావటంతో ఎక్స్‌రేలు తీయటానికి సమయం పడుతోంది. దీనిని నివారించేందుకు ప్రస్తుతం ఎక్కువ మంది రేడియాలజిస్ట్‌లను నియమించాం.

**వైద్యాన్ని వ్యాపారం చేశారంటూరు..దీనిపై మీ అభిప్రాయం ఏమిటి ?**

ఈ రోజుల్లో వైద్యనికి చాలా ఖర్చు అవుతుంది. పూర్వం నాడి పట్టుకుని వైద్యం చేసేవాళ్లు ఇప్పుడు అనేక రకాలైన వైద్య పరికరాలు అందుబాటులో ఉన్నాయి. ఇవన్నీ ఖరీదైనవి కావడంతో వైద్యపరీక్షలకు ఎక్కువ ఖర్చు అవుతోంది. అయినప్పటికీ 95 శాతం వైద్యులు రోగుల ఖర్చులపై మంచి అవగాహనతో సహాయం అందిస్తారు. కొంత మంది వ్యాపారంగా చూడటం గర్హనీయం.

**యాంత్రిక పరికరాలపై ఆధారపడే వైద్యులకు నైపుణ్యతపై స్పష్టత ఎలా వస్తుంది?**

సాదారణంగా రోగిపై వైద్యుని అవగాహన ఉంటుంది.కేవలం సాంకేతిక ఆధారంగా వైద్యం అందించబోము. అవసరమైన మేర వైద్య పరీక్షలు తప్పని సరి. దీంతోనే వ్యాధి నిర్ధారణ స్పష్టంగా ఉంటుంది.

**మనదేశంలో డాక్టర్లకే ల్యాబ్‌లు ఉండటంతో అధిక పరీక్షలు చేయిస్తున్నారని రోగులు వాపోతున్నారు దీనిపై మీ అభిప్రాయం ?**

సాధారణంగా వైద్యునికి ల్యాబ్‌లు ఉండకూడదు. అమెరికాలో ఇటువంటి నిబంధన ఉంది. మనకు అలాంటి చట్టాలు లేవు.


**వైద్యులకు- రోగులకు మధ్య ఘర్షణ వాతావరణం ఎందుకు వస్తోంది?**

రోగికి సమయమనేది ముఖ్యం.. కొన్నిసార్లు చివరి నిమిషంలో ఇక్కడికి వస్తారు. దాంతో రోగిని కాపాడగలిగే అవకాశాలు తగ్గిపోతాయి.. డాక్టర్లకు డబ్బే ప్రధానం కాదు.. నిర్లక్ష్యత అస్సలు ఉండకూడదు.

**ఎన్ఆర్ఐ భవిష్యత్తు ప్రణాళికలేంటి?**

ఔట్ పేషంట్ల కోసం లక్ష చదరపు అడుగుల భవనం నిర్మించాల్సి ఉంది. సూపర్ స్పెషాలిటీని 5వ అంతస్తుకు మారుస్తున్నాం. కాలేయం,గుండె ట్రాన్స్‌ప్లాంట్ల కోసం ప్రణాళికలను సిద్ధం చేస్తున్నాం. ఒక సిమ్యులేషన్ ల్యాబ్‌ను తీసుకురాబోతున్నాం. రానున్న మూడేళ్లలో ఒక ప్రైవేటు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికోసం ప్రణాళికలు తయారు చేస్తున్నాం.

**అమెరికాలో వైద్యానికి, ఇక్కడి వైద్యానికి తేడాలేంటి?**

అమెరికాలో చట్టాలను కఠినంగా అనుసరిస్తారు. దీంతో వైద్యులకు బాధ్యతలు ఎక్కువ... శ్రద్ధతో వైద్యం చేస్తారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఎక్కువగా ఉన్నా.. చిన్న ఆపరేషన్లు చేసి వెంటనే ఇంటికి పంపిస్తారు.ఆసుపత్రిలో ఉంటే ఇన్ఫెక్షన్లు ఎక్కువ అవుతాయి. కాబట్టి అదే రోజు పంపిస్తారు. చాలా మంది అమెరికన్లు విద్యావంతులు. ప్రభుత్వం బాగా సహకరిస్తుంది. అయితే అమెరికాలో వైద్య ఖర్చులు ఎక్కువ.


**అమెరికాలో వైద్యానికి, ఇక్కడి వైద్యానికి తేడాలేంటి?**

అమెరికాలో చట్టాలను కఠినంగా అనుసరిస్తారు. దీంతో వైద్యులకు బాధ్యతలు ఎక్కువ... శ్రద్ధతో వైద్యం చేస్తారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఎక్కువగా ఉన్నా.. చిన్న ఆపరేషన్లు చేసి వెంటనే ఇంటికి పంపిస్తారు.ఆసుపత్రిలో ఉంటే ఇన్ఫెక్షన్లు ఎక్కువ అవుతాయి. కాబట్టి అదే రోజు పంపిస్తారు. చాలా మంది అమెరికన్లు విద్యావంతులు. ప్రభుత్వం బాగా సహకరిస్తుంది. అయితే అమెరికాలో వైద్య ఖర్చులు ఎక్కువ.

**అమెరికాలో మెడికల్ కాలేజీలు ఎలా ఉంటాయి?**

అక్కడ మొదటి సంవత్సరం నుంచే పేషెంట్లను వైద్యవిద్యార్థులు పరీక్షిస్తారు.

**భారత్ నుంచి ధనవంతులు, రాజకీయ నాయకులు వైద్యానికి అమెరికా వెళుతుంటారు.. ఎందుకని?**

అక్కడ ప్రైవసీ ఉంటుంది.. ఆధునిక వైద్య పరిజ్ఞానం ఉంది. చాలా మందులు ముందుగా అక్కడే అందుబాటులోకి వస్తాయి. మంచి నిపుణులు ఉన్నారు. మయోక్లినిక్ వంటి అత్యంత మంచి, ఆధునిక ఆసుపత్రులు అమెరికాలో ఉన్నాయి. దీంతో చాలా మంది అక్కడి వైద్యానికి ప్రాధాన్యత ఇస్తారు.

**ఒకే బెడ్‌పై ఇద్దర్ని ఉంచుతారు... ఎందుకలా?**

ఎంసీఎం రూల్స్ ప్రకారం వార్డులలో బెడ్‌లు ఉండాలి. మేము ఒక బెడ్‌కు ఒక రోగిని మాత్రమే కేటాయిస్తాం. యుద్ధసమయాలలో లేక కొన్ని ప్రత్యేక పరిస్థితులలో మాత్రమే కొన్ని మినహాయింపులు ఉంటాయి. మన రోగులకు రోగ నిరోధక శక్తి ఎక్కువ.



నిరంతర పర్యవేక్షణలో డాక్టర్లు

**ఎన్ఆర్ఐలో వార్డులు, వాష్‌రూములు పరిశుభ్రంగా ఉన్నాయా ? తాగునీటి సౌకర్యం ఎలా ఉంది?**

ప్రతి రోజు వార్డులు, వాష్‌రూములపై నివేదిక వస్తుంది. పారిశుద్ధ్యానికే ప్రధమ ప్రాధాన్యత. మంచినీటి కొరతను అధిగమించేందుకు చర్యలు చేపడుతున్నాం..

**ఆసుపత్రి గురించి చెప్పండి?**

మా సేవలపై ప్రజలు సంతోషంగా ఉన్నారు. ఇక్కడి విద్యార్థుల్లో 10 శాతం మంది విదేశాల్లో పని చేస్తున్నారు. ఇది చాలాసంతోషాన్ని ఇస్తుంది. త్వరలో మరికొన్ని వసతులను మెరుగు పరుస్తాం. ఉదాహరణకు తాగునీటిని చిన్నకాకాని నుంచి తెచ్చుకుంటాం.. దాదాపు 100 ట్రాక్టర్లను వాడుతున్నాం.. నేరుగా కాలువ నుంచి తెచ్చుకొవటానికి ప్రభుత్వ అనుమతుల కొరకు కోరాం.



విద్యార్థులకు అత్యాధునిక బోధన

**కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం నుంచి మీరేం కోరుతున్నారు?**

ఆరోగ్యశ్రీ పథకం ద్వారా కేవలం 40-50 కేసులను మాత్రమే అనుమతి ఉంది. నీటి సమస్య.. నిధుల కొరత కూడా ఉంది. సర్జరీ కోసం ఏ రోగి వచ్చినా సహాయం చేయగలిగి ఉండాలి. ఈ సమస్యలపై స్థానిక ఎమ్మెల్యే రామకృష్ణరెడ్డి ద్వారా ముఖ్యమంత్రికి మా సమస్యలను తెలియచేయాలనుకుంటున్నాం.

**టీకాల గురించి చెప్పండి?**

చాలా వరకు వ్యాధులను వ్యాక్సీన్ల (టీకాల) ద్వారా నివారించగలిగాం. హెచ్‌పీవీ వంటి వ్యాక్సీన్లు, పాముకాటుకు యాంటీ వీనమ్, కుక్కకాటుకు యాంటీ రేబీస్‌కు ఇంజెక్షన్ల అందుబాటులో ఉంచాం.

**మంగళగిరిలో కేంద్ర ప్రభుత్వం ఎయిమ్స్ నిర్మాణం చెపట్టారు..దీంతో మీపై ఎలాంటి ప్రభావం పడుతుంది ?**

కేంద్ర ప్రభుత్వం హాస్పిటల్‌కు ఎక్కువ ఆర్థిక వనరులు ఉంటాయి. ఉద్యోగులకు జీతాలు ఎక్కువ కాబట్టి అక్కడ పనిచేయటానికి ఎక్కువ మంది ఆకర్షితులవుతారు. దీంతో మాకు రాబోయే రోజుల్లో అధ్యాపకుల కొరత ఉండే అవకాశం ఉంది.



అత్యాధునిక పరికరాలతో ఆపరేషన్ థియేటర్

**ఎన్ఆర్ఐ భవిష్యత్తు ప్రణాళికలేంటి?**

ఔట్ పేషంట్ల కోసం లక్ష చదరపు అడుగుల భవనం నిర్మించాల్సి ఉంది. సూపర్ స్పెషాలిటీని 5వ అంతస్తుకు మారుస్తున్నాం. కాలేయం,గుండె ట్రాన్స్‌ప్లాంట్ల కోసం ప్రణాళికలను సిద్ధం చేస్తున్నాం. ఒక సిమ్యులేషన్ ల్యాబ్‌ను తీసుకురాబోతున్నాం రానున్న మూడేళ్లలో ఒక ప్రైవేటు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి కోసం ప్రణాళికలు తయారు చేస్తున్నాం.

**యువతకు నైతిక విలువలు, ఒత్తిడిని అధిగమించడంపై అవగాహన కల్పిస్తున్నారా?**

యువతకు అన్ని రకాలుగా సహాయం అందించటానికి అనుభవజ్ఞులైన మానసిక వైద్యులు కౌన్సెలింగ్ చేస్తున్నారు.ఏదైనా సమస్య ఉంటే ఫోన్ చేసి సహాయం పొందటానికి ప్రత్యేక ఫోన్‌లైన్ ఏర్పాటు చేశాం.




విలాసవంతమైన ఆస్పత్రి లోపలి ప్రాంగణం

**అమెరికా విద్యార్థులకు ఇక్కడివారికి తేడాలేమిటి ?**

అక్కడ విద్యార్థులకు తల్లిదండ్రులు ఎక్కువ స్వేచ్ఛను కల్పిస్తారు. దీంతో అది కొంత చెడుప్రభావానికి దారితీసి కొంత మంది విద్యార్థులు మత్తుమందులకు, మద్యపానానికి అలవాటుపడుతున్నారు. ఇవే పరిస్థితులు మనదేశంలోనూ చోటు చేసుకుంటున్నాయి. ఇది చాలా కలవరం కలిగిస్తోంది.

**అమెరికా అభివృద్ధి చెందిన దేశంగా మారడానికి కారణం ఏమిటి ?**

కష్ట పడే ప్రజలు, సమయానికి పనులు చేయటం, చెప్పిందే చేయటం. కంపెనీలలో పనిచేసే వారికి ప్రోత్సాహకాలు అందించడం వంటి వాటితో ఆదేశం గణనీయంగా అభివృద్ధి చెందింది.

**ప్రజలకు మీరిచ్చే సలహాలు ఏమిటి ?**

ఎన్ఆర్ఐ ఆసుపత్రి అందుబాటు ధరల్లో అన్ని పరీక్షలు నిర్వహిస్తోంది. తక్కువ ఫీజులతో ఆధునిక వైద్యాన్ని అందిస్తున్నాం. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. అలాగే మెడికల్ కాలేజీలో విద్యార్థులు బాగా చదువుకుని తద్వారా సమాజానికి మెరుగైనా సేవలు అందించాలని కొరుకుంటున్నా..

ఇంటర్వ్యూ : హుస్సేన్ ఖాన్




క్యాజువాలిటీ విభాగంలో చికిత్సకోసం వచ్చిన రోగులు

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/s Vastitude Media Pvt. Ltd., and Printed at M/s Jagati Publications Ltd., Sakshi Press, Survey No. 766/2, Ankireddy Palem Village, Guntur Rural, 522005, Guntur Distt. A.P. and Published at 6-45/1, Rayapudi, Thullur Mandal, Guntur Distt, Andhra Pradesh-522237. Editor: Pattan Hussain Khan, RNI NO: APTEL/2015/66622, Postal Regd No: GTR/84/2019-21, Cell 94406 62699, Email : rajadhanivartalu1@gmail.com